# ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి
# పంపిణీ అనుమతి నిబంధనలు
# 2013 లో 10వ నిబంధన

(ఆంధ్రప్రదేశ్ అసాధారణ రాజపత్రం, 2వ భాగంలో 21.8.2013న ప్రచురించబడినది)

కేంద్ర విద్యుత్ చట్టము, 2003 లోని నిబంధనల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనుమతులను మంజూరు చేయుటకు అధికారము ఉన్న మండలి, ప్రత్యేకించి ఈ క్రింది విషయములకు సంబంధించి నిబంధనలు చేయవలసియున్నది, అవేవనగా, (ఏ) 14వ పరిచ్ఛేదము లోని మొదటి మినహాయింపు క్రింద నిర్ధిష్ట పరచవలసిన వ్యవధి; (బి) 15వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద దరఖాస్తు స్వరూపము మరియు రీతి; (సి) 15వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) క్రింద ప్రచురించబడవలసిన అనుమతి దరఖాస్తు పద్ధతి మరియు వివరములు; (డి) 16వ పరిచ్ఛేదము క్రింద అనుమతి షరతులు; (ఇ) 18వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) లోని ఖండము (ఏ) క్రింద ప్రకటన (నోటీసు) పద్ధతి మరియు వివరములు; మరియు (ఎఫ్) 18వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) లోని ఖండము (సి) క్రింద అనుమతిలో చేయవలసిన మార్పులు లేక సవరణల ప్రచురణ.

ఆసక్తిగల వ్యక్తులు మరియు లబ్ధిదారుల నుండి 7.8.2013 లోగా సలహాలు / సూచనలను కోరుతూ 26.7.2013 న మండలి ముసాయిదా నిబంధనను వెబ్ సైటులో ఉంచడమైనది. సలహాలనూ / సూచనలనూ అన్నింటినీ పరిశీలించి మండలి ఈ క్రింది నిబంధనను చేయుచున్నది.

కేంద్ర విద్యుత్ చట్టము, 2003 (2003 లో 36వ చట్టము) లోని పరిచ్ఛేదములు 15, 16, 18 మరియు 181 (2) ల ద్వారా లభించిన అధికారములను మరియు ఈ విషయములో వీలు కలిగించే అన్ని అధికారములనూ వినియోగిస్తూ, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఈ క్రింది నిబంధనలను జారీ చేయడమైనది:--

## అధ్యాయము - 1
## ప్రారంభిక

**1. సంగ్రహనామము, విస్తరణ మరియు ప్రారంభము:**

i) ఈ నిబంధనలను ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (పంపిణీ అనుమతి) నిబంధనలు, 2013 అని పేర్కొనవచ్చును.

ii) ఈ నిబంధనలు, రాష్ట్రంలోని అనుమతిదారులందరికీ మరియు ఈ నిబంధనలు ప్రచురించబడిన తేదీ నాటికి మండలి సమక్షంలో నిలిచి ఉన్న దరఖాస్తులతో సహా పంపిణీ అనుమతి దరఖాస్తులకు సంబంధించి వర్తించును.

iii) ఈ నిబంధనలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్కరణ చట్టము, 1998 క్రింద అనుమతి మంజూరైన పంపిణీ అనుమతిదారులందరికీ వర్తించును.

iv) ఈ నిబంధనలు, ఆంధ్రప్రదేశ్ రాజపత్రములో అవి ప్రచురించబడిన తేదీ నుండి అమలులోనికి వచ్చును.

## అధ్యాయము - 2

## సాధారణ

**2. నిర్వచనములు, అర్థాన్వయము మరియు సమీక్ష:**

**(i) నిర్వచనములు:**

ఈ నిబంధనలలో సందర్భమును బట్టి వేరే అర్థము ఉన్ననే తప్ప:---

(ఏ) "అకౌంటింగు వివరణ" అనగా ప్రతి ఆర్థిక సంవత్సరమునకు సంబంధించి, ఈ క్రింది వాటితో కూడిన అనుమతి పొందిన వ్యాపారమునకు చెందిన అకౌంటింగు వివరణలు అని అర్థము, అవేవనగా,

(i) బ్యాలన్సుషీటు, కంపెనీల చట్టము, 1956 కు గల అనుబంధము-6 లోని భాగము-2 లో ఉన్న స్వరూపము ప్రకారము తయారుచేయబడినది.

(ii) లాభనష్టముల అకౌంటు, కంపెనీల చట్టము, 1956 కు గల అనుబంధము-6 లోని భాగము-2 లో ఉన్న అవసరాలమేరకు ఉన్నది.

(iii) క్యాష్ ఫ్లో వివరణ, భారత చార్టర్డ్ అకౌంటెంట్ల సంస్థ యొక్క క్యాష్ ఫ్లో వివరణపై అకౌంటింగు ప్రమాణాలననుసరించి తయారుచేయబడినది.

(iv) పంపిణీ అనుమతిదారుని యొక్క చట్టబద్ధమైన ఆడిటర్ల నివేదిక.

(v) కంపెనీల చట్టము, 1956 లో పరిచ్ఛేదము 209 (1) (డి) క్రింద కేంద్ర ప్రభుత్వము నిర్దేశించిన ఖర్చు రికార్డులు; దీనితో పాటుగా వనరుల వివరణ మరియు నిధుల వర్తింపు మరియు మండలి ఆయా సమయములందు ఆదేశించునట్టి ఇతర ఆధార వివరణలు మరియు సమాచారము:

అయితే, ఈ విద్యుత్తు వ్యాపారము చేసే ఏదేని స్థానిక ప్రాధికారమునకు వర్తించు సంబంధిత చట్టములు లేక నియమాల ప్రకారం తయారుచేయబడి నిర్వహించబడుచున్న పైన తెలిపిన అంశములు అని అర్థము.

(బి) "చట్టము" అనగా కేంద్ర విద్యుత్తు చట్టము, 2003 (2003 లో 36వ చట్టము) అని అర్థము;

(సి) "వార్షిక అకౌంట్లు" అనగా కంపెనీల చట్టము, 1956 యొక్క నిబంధనల ప్రకారం, మరియు/లేక మండలి ఆయా సమయములందు ఆదేశించినట్టి ఇతర రీతిలో, తయారుచేయబడిన పంపిణీ అనుమతిదారుని అకౌంట్లు అని అర్థము;

(డి) "దరఖాస్తుదారు" అనగా పంపిణీ అనుమతి మంజూరు కొరకు దరఖాస్తు చేసిన వ్యక్తి అని అర్థము;

(ఇ) "పంపిణీ ప్రాంతము" లేక "సరఫరా ప్రాంతము" అనగా వినియోగదారులకు విద్యుత్తును సరఫరా చేయుటకై పంపిణీ వ్యవస్థను నిర్వహించుటకు పంపిణీ అనుమతిదారునికి అధికారమీయబడిన పంపిణీ అనుమతిలో తెలిపిన ప్రాంతము అని అర్థము;

(ఎఫ్) "టోకు సరఫరా" అనగా పంపిణీ కొరకు మరియు/లేక రిటైలు సరఫరా కొరకు అధికారము పొందిన వ్యక్తికి అనుమతిదారుడు చేయు విద్యుత్ సరఫరా అని అర్థము;

(జి) "మండలి" అనగా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి అని అర్థము;

(హెచ్) "భావించబడు అనుమతిదారుడు" అనగా తన సరఫరా ప్రాంతములో వినియోగదారులకు విద్యుత్తును సరఫరా చేయుటకై పంపిణీ వ్యవస్థను నిర్వహించుటకు చట్టము యొక్క 14వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (బి) క్రింద మరియు 14వ పరిచ్ఛేధములోని ఒకటవ, రెండవ, మూడవ మరియు అయిదవ మినహాయింపుల క్రింద అధికారము పొందిన వ్యక్తి అని అర్థము;

(ఐ) "పంపిణీ" అనగా పంపిణీ వ్యవస్థ ద్వారా విద్యుత్తు రవాణా లేక వీలింగు అని అర్థము;

(జె) "పంపిణీ వ్యాపారము" అనగా తన సరఫరా ప్రాంతములో వినియోగదారులకు విద్యుత్తును సరఫరా చేయుటకు, పంపిణీ వ్యవస్థను నడిపించుటకు మరియు నిర్వహించుటకు పంపిణీ అనుమతిదారుడు అధికారము పొందిన వ్యాపారము అని అర్థము;

(కె) "పంపిణీ అనుమతిదారుడు" అనగా తన సరఫరా ప్రాంతములో వినియోగదారులకు విద్యుత్తును సరఫరా/రవాణా/వీలింగు కొరకు పంపిణీ వ్యవస్థను నడిపించుటకు మరియు నిర్వహించుటకు పంపిణీ అనుమతి ద్వారా అధికారము పొందిన వ్యక్తి అని అర్థము. ఇందులో భావించబడు అనుమతిదారుడు కూడా చేరియుండును;

(ఎల్) "సాధారణ షరతులు" అనగా ఈ నిబంధనలలో నిర్దేశించిన విధంగా పంపిణీ అనుమతి యొక్క సాధారణ షరతులు అని అర్థము;

(ఎమ్) "అనుమతి" అనగా 2003 చట్టము లోని 14వ పరిచ్ఛేదము క్రింద మంజూరైన అనుమతి అని అర్థము;

(ఎన్)"అనుమతి పొందిన వ్యాపారము" అనగా పంపిణీ అనుమతి క్రింద అధికారము పొందిన విద్యుత్ పంపిణీ మరియు రిటైలు సరఫరా వ్యాపారము అని అర్థము;

(ఓ) "పెద్ద సంఘటన" అనగా సరఫరాలో అంతరాయము పరికరములకు ఎక్కువ స్థాయిలో చెరుపు లేక ప్రాణనష్టము లేక మనుషులకు గాయాలకు దారి తీసిన విద్యుత్తు పంపిణీలో జరిగిన సంఘటన లేక ఇతర విధముగా మండలి తెలిపిన సంఘటన అని అర్థము. పెద్ద సంఘటనగా మండలి ప్రకటించిన ఏదేని ఇతర సంఘటన కూడా ఇందులో చేరి యుండును;

(పి) "ఇతర వ్యాపారము" అనగా అనుమతి పొందిన వ్యాపారము కాకుండా పంపిణీ

అనుమతిదారుడు చేయు ఏదేని వ్యాపారము అని అర్థము;

(క్యు) "సంస్కరణ చట్టము" అనగా ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్కరణ చట్టము, 1998 అని అర్థము;

(ఆర్) "నిబంధనలు" అనగా చట్టము యొక్క నిబంధనల క్రింద మండలి చేయు నిబంధనలు అని అర్థము;

(ఎస్) "రిటైలు సరఫరా" అనగా తన సరఫరా ప్రాంతము లోపల పంపిణీ అనుమతిదారుడు ఎవరేని వినియోగదారునికి చేయు విద్యుత్ సరఫరా అని అర్థము మరియు "రిటైలు సరఫరాదారుడు" మరియు "రిటైలు సరఫరా వ్యాపారము" అను పదములను సందర్భానుసారముగా అన్వయించుకొనవలెను;

(టి) "నిర్దిష్ట షరతులు" అనగా సాధారణ షరతులకు అదనంగా వాటిని తగ్గించే విధంగా కాకుండా పంపిణీ అనుమతిదారుని కొరకు లేక అనుమతిదారుల తరగతి కొరకు మండలి నిర్థిష్టముగా తెలిపిన షరతులు అని అర్థము;

(యు) "రాష్ట్ర గ్రిడ్ నియమావళి" అనగా మండలి నిర్దేశించిన గ్రిడ్ నియమావళి అని అర్థము;

(వి) "కార్యదర్శి" అనగా మండలి కార్యదర్శి అని అర్థము;

(డబ్ల్యు) "సంవత్సరము" అనగా క్యాలండరు సంవత్సరంలో ఏప్రియల్ మొదటి తేదీ నుండి తదుపరి క్యాలండరు సంవత్సరంలోని మార్చి 31వ తేదీ మధ్య 12 నెలల వ్యవధి అని అర్థము.

(ii) **అర్థాన్వయము:**

(ఏ) ఈ నిబంధనలలో ఉపయోగించబడి, నిర్వచించబడని పదములు మరియు పదబందములు, చట్టములో నిర్వచించబడినట్లయితే, చట్టములో వాటికి తెలిపిన అర్థమునే అవి కలిగియుండును. ఇందులో ఉపయోగించబడిన పదబంధములు ఈ నిబంధనలలోగాని, చట్టములోగాని నిర్థిష్టముగా నిర్వచించబడని యెడల, సమర్థ శాసన మండలిచే ఆమోదించబడి రాష్ట్రములోని విద్యుత్ పరిశ్రమకు వర్తించే ఏదేని చట్టములో నిర్వచించబడిన యెడల అట్టి చట్టములో వాటికి తెలిపిన అర్థమునే అవి కలిగియుండును.

(బి) ఈ నిబంధనలను అన్వయించయించుటలో సందర్భమును బట్టి వేరే అర్థము ఉన్ననే తప్ప,

(1) ఏకవచనములో లేక బహువచనములో ఉన్న పదములు సందర్భానుసారముగా, వరుసగా బహువచనములో లేక ఏకవచనములో కూడా చేరియుండునట్లు భావించవలెను;

(2) ఈ నిబంధనలలో ఉన్న నిర్దేశములను, మండలి ఆయా సమయములందు, అమలులో ఉన్న చట్టముల ప్రకారం సవరించిన విధంగా లేక మార్పు చేసిన విధంగా ఉండే ఈ నిబంధనలలోని నిర్దేశములుగా భావించవలెను.

(సి) శీర్షికలను సౌకర్యము నిమిత్తం చేర్చడమైనది. ఈ నిబంధనల అర్థాన్వయము నిమిత్తము

వాటిని లెక్కలోనికి తీసుకొనరాదు.

(డి) చట్టములకు, నిబంధనలకు లేక మార్గదర్శకములకు చేసిన నిర్దేశములను అట్టి చట్టములను, నిబంధనలను లేక మార్గదర్శకములను ఏకీకరిస్తున్న, సవరించుచున్న లేక భర్తీచేయుచున్న అన్ని చట్టబద్ధ నిబంధనలతో సహా అన్వయించుకొనవలెను.

(iii) **సమీక్ష:**

ఈ నిబంధనలపై, మండలి, ఆయా సమయములందు, ఓపెన్ యాక్సెస్ నిబంధనతో ఏకరూపంలో ఉండే విధంగా మరియు/లేక అభివృద్ధిచెందుతున్న విద్యుత్ మార్కెట్ల అవసరాలను తీర్చేవిధంగా, చట్టము యొక్క 66వ పరిచ్ఛేదముననుసరించి సమీక్ష జరుపవచ్చును.

## అధ్యాయము - 3

## పంపిణీ అనుమతి మంజూరు విధానము

3. ఈ నిబంధనల క్రింద వ్యవహారములన్నీ ఆయా సమయములందు సవరించబడిన ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (కార్య నిర్వహణ) నిబంధనల ప్రకారము వ్యవహరించబడును.

4. **పంపిణీ అనుమతి మంజూరుకు దరఖాస్తు :**

i) పంపిణీ అనుమతి మంజూరు కొరకు దరఖాస్తును, ఈ నిబంధనలలోని అనుబంధము-1 లో నిర్ధిష్టపరచిన రూపంలో మండలికి సమర్పించవలెను. రాష్ట్ర ప్రభుత్వము నిర్ణయించిన ఫీజును దరఖాస్తుకు జతపరచవలెను. ఫీజును, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి యొక్క కార్యదర్శి పేరున తీసిన బ్యాంకు డ్రాఫ్టు / పే ఆర్డరు ద్వారా చెల్లించవలెను.

ii) పంపిణీ అనుమతి కొరకైన ప్రతి దరఖాస్తుపై దరఖాస్తుదారుడు లేక అతని తరపున సంతకము చేయవలెను. మండలి కార్యదర్శికి దరఖాస్తును చేసుకొనవలెను. దరఖాస్తును 5 సెట్లుగా పంపవలెను.

iii) పంపిణీ అనుమతి కొరకైన దరఖాస్తును జతపరచవలసిన వాటితో సహా మండలికి సమర్పించవలెను. దరఖాస్తును కాంపాక్టు డిస్కు (సి.డి.) రూపములో కూడా, డేటా రక్షణకు, వైరస్ నిర్మూలనకు తగిన చర్యలు తీసుకొని, సమర్పించవలెను.

iv) దరఖాస్తుదారుడు, పూర్తి దరఖాస్తును, జతపరచిన వాటితో సహా, తన స్వంత వెబ్ సైటులో ఉంచవలెను లేక స్వంత వెబ్ సైటు లేని యెడల ఏదేని ఇతర వెబ్‌సైటులో ఉంచి దరఖాస్తును ఇంటర్నెట్ ద్వారా చూసే అవకాశమును కల్పించవలెను.

5. **దరఖాస్తు స్వీకరణ మరియు తిరుగు రసీదు :**

పంపిణీ అనుమతి కొరకు దరఖాస్తు అందిన మీదట, మండలి కార్యదర్శి, దాని వివరములను ఇందు నిమిత్తము నిర్వహించు ఒక రిజిస్టరులో నమోదు చేసి దరఖాస్తుకు ఒక గుర్తింపు సంఖ్యను కేటాయించవలెను. కార్యదర్శి, దరఖాస్తు అందిన తేదీని, గుర్తింపు సంఖ్యను తెలుపుతూ దరఖాస్తుదారునికి దరఖాస్తులో తెలిపిన చిరునామాకు తిరుగు రసీదును పంపవలెను.

6. **దరఖాస్తును గురించి బహిరంగ ప్రకటన :**

i) దరఖాస్తుదారు, అట్టి దరఖాస్తు చేసిన 7 రోజుల లోపల, తాను అనుమతిని కోరుతున్న పంపిణీ ప్రాంతములో అధిక సంఖ్యలో ప్రాచుర్యములో ఉన్న ఒక ఆంగ్ల దినపత్రిక మరియు రెండు తెలుగు దినపత్రికలలో బహిరంగ ప్రకటన ప్రచురించ వలెను. ప్రకటనలో ఈ క్రింది వివరములను తెలుపవలెను, అవేవనగా:-

(ఏ) పైన పెద్ద అక్షరములలో దరఖాస్తుదారుని పేరు. దరఖాస్తుదారుడు, వ్యక్తి, లేక భారత భాగస్వామ్య చట్టము, 1932 (1932 లో 9వ చట్టము) క్రింద రిజిస్టరైన భాగస్వామ్య సంస్థ లేక కంపెనీల చట్టము, 1956 (1956 లో 1వ చట్టము) క్రింద ఏర్పాటైన ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ లేక పబ్లిక్ లిమిటెడ్ కంపెనీ లేక చట్టబద్దముగా ఏర్పడిననూ, ఏర్పడకపోయిననూ ఏదేని ఇతర సంస్థ అన్న విషయమును స్పష్టముగా తెలుపుతూ, కార్యాలయ పూర్తి చిరునామాను మరియు రిజిస్టర్డు కార్యాలయం ఉన్న యెడల దాని చిరునామా;

(బి) దరఖాస్తుదారుడు, చట్టము యొక్క 15వ పరిచ్ఛేదము క్రింద పంపిణీ అనుమతి మంజూరు కొరకు దరఖాస్తును మండలికి సమర్పించినట్లుగా వివరణ;

(సి) పంపిణీ అనుమతికి ప్రతిపాదించిన ప్రాంతము;

(డి) దరఖాస్తుదారుని ఆర్థిక మరియు సాంకేతిక సామర్థ్యం, యాజమాన్య స్వరూపం మరియు షేర్ హోల్డింగు విధానము (ఉన్న యెడల);

(ఇ) మండలి వద్ద ఆయా సమయములందు దాఖలు చేసిన దరఖాస్తు మరియు ఇతర దస్తావేజులు ఎవరేని తనిఖీ చేయుట కొరకు దరఖాస్తుదారుని వద్ద అందుబాటులో ఉన్నట్లు తెలుపుతూ వివరణ;

(ఎఫ్) ప్రతిపాదిత పంపిణీ అనుమతి ప్రాంతములోని పెద్ద నగరములు లేక పట్టణములలో, దరఖాస్తును మరియు దస్తావేజులను తనిఖీ కొరకు ఎవరు అందించగలరు లేక వాటిని ఫొటో కాపీయింగు చార్జీలకు మించని రేటుకు ఎవరి వద్ద నుండి స్వయంగా కొనుగోలు చేయవచ్చునో లేక పోస్టుద్వారా పొందవచ్చునో దరఖాస్తుదారుడు నామనిర్దేశము చేసిన వారి పేర్లు, చిరునామాలు మరియు ఇతర వివరములు;

(జి) ప్రతిపాదిత పంపిణీ అనుమతి యొక్క సంక్షిప్త వివరములు;

(హెచ్) పూర్తి అయిన దరఖాస్తు, దరఖాస్తుదారుని వెబ్‌సైటులో లేక అధికారము పొందిన ఇతర వెబ్‌సైటులో అందుబాటులో ఉన్నట్లు మరియు ఉచితముగా డౌనులోడు చేసుకొనవచ్చునని తెలుపుతూ వివరణ;

(ఐ) అభ్యంతరములు ఏవేని ఉన్నయెడల, ప్రకటన ప్రచురించబడిన తేదీ నుండి 30 రోజుల

లోపల ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి కార్యదర్శి సమక్షంలో దాఖలు చేసుకొనవచ్చునని, మండలి కార్యాలయ చిరునామాను తెలుపుతూ వివరణ:

అయితే, దరఖాస్తుదారుడు, తన వ్యాపార ప్రయోజనములను లేక మేథో సంపత్తిపై హక్కులను కాపాడుకొనుటకు గాను తగిన మరియు సహేతుకమైన కారణములపై పైన తెలిపిన ఏదేని సమాచారమును ప్రచురించకుండా అనుమతిని పొందుటకు మండలిని కోరవచ్చును. మండలి తగిన పరిశీలన జరిపిన మీదట అట్టి అభ్యర్థనను అంగీకరించవచ్చును లేక తిరస్కరించవచ్చును.

అంతేకాక, నిర్దిష్టపరచిన రీతిలో గోప్యనీయముకాని సమాచారము యొక్క సంగ్రహమును ప్రచురించవలసినదిగా దరఖాస్తుదారుని కోరవచ్చును.

ii) పైన తెలిపిన దానికి అదనముగా, దరఖాస్తుకు సంబంధించిన ప్రకటనను, కేంద్రప్రభుత్వము, రాష్ట్రప్రభుత్వము, ఏదేని స్థానిక అధికారము లేక ఏదేని ఇతర అధికారము యొక్క నియమిత ప్రతినిధికి లేక మండలి సముచితమని భావించునట్టి వ్యక్తి లేక సంస్థకు అందజేయవలెనని మండలి ఆదేశించవచ్చును.

iii) దరఖాస్తుదారుడు, పైన తెలిపిన ప్రకటనను ప్రచురించిన తేదీ నుండి 7 రోజుల లోపల, మండలికి, ప్రమాణ పత్రమును (అఫిడవిట్టు), ప్రచురించిన ప్రకటన వివరములను సమర్పించవలెను మరియు ప్రకటనలు ప్రచురించబడిన వార్తాపత్రికల ప్రతులను కూడా దాఖలు చేయవలెను.

7. **దరఖాస్తు మరియు దస్తావేజుల బహిరంగ తనిఖీ :**

i) 6వ నిబంధన ప్రకారం ప్రకటనను ప్రచురించిన తేదీ నుండి దరఖాస్తుదారుడు, తన స్వంత కార్యాలయము లోను మరియు తన ఏజెంట్ల కార్యాలయములోనూ మండలి ఆయా సమయములందు నిర్దేశించిన విధంగా ప్రతీ స్థానిక ప్రాధికారం వద్ద కూడా తాను సమర్పించిన దరఖాస్తు మరియు అన్ని దస్తావేజుల నకళ్ళను అందుబాటులో ఉంచవలెను.

ii) దరఖాస్తుదారుడు, తాను సమర్పించిన దరఖాస్తు మరియు దానికి జతపరచిన పత్రముల నకళ్ళ కొరకు దరఖాస్తు చేయు వ్యక్తులందరికి వాటి ఫొటో కాపీయింగుకు అయ్యే సముచిత ధరకు వాటి ముద్రిత నకళ్ళను అందజేయవలెను.

8. **దరఖాస్తు పరిశీలన మరియు అదనపు సమాచారమును కోరుట :**

i) కార్యదర్శి లేక ఈ ప్రయోజనము నిమిత్తము మండలిచే నియుక్తుడైన ఇతర అధికారి, దరఖాస్తును పరిశీలించిన మీదట, దరఖాస్తును వ్యవహరించుటకు అవసరమని భావించిన అట్టి అదనపు సమాచారమును లేక దస్తావేజులను, దరఖాస్తు అందిన తేదీ నుండి 30 రోజుల లోగా సమర్పించవలసినదిగా దరఖాస్తుదారుని కోరవచ్చును.

ii) కార్యదర్శి లేక ఇందు నిమిత్తం నియుక్తుడైన అధికారి దరఖాస్తు మరియు దానికి జతపరచిన

దస్తావేజులు అన్ని విధములుగా పూర్తిగా ఉన్నట్లు కనుగొనిన యెడల, దరఖాస్తును సక్రమముగా సమర్పించుటకు నిర్దేశించిన కార్యవిధానమును దరఖాస్తుదారు పూర్తిగా పాటించిన మీదట, కార్యదర్శి/నియుక్తుడైన అధికారి, దరఖాస్తు ఈ నిబంధనలలో తెలిపిన కార్యవిధానమునను సరించి పంపిణీ అనుమతి కొరకు పరిశీలించుటకు అనువుగా ఉన్నట్లు ధృవీకరించవలెను.

**9. అభ్యంతరములు మరియు సలహాలు :**

i) పంపిణీ అనుమతి మంజూరుకు సంబంధించి అభ్యంతరం తెలుపదలచిన / సలహానీయదలచిన ఎవరేని వ్యక్తి, పైన 6వ నిబంధనలో పేర్కొన్న మొదటి ప్రకటన జారీ అయిన తేదీ నుండి 30 రోజుల లోపల తన అభ్యంతరములను / సలహాలను దాఖలు చేయవలెను. వీటిని మండలి కార్యదర్శికి తెలియజేస్తూ, నకలును దరఖాస్తుదారునికి పంపవలెను.

ii) సంబందిత స్థానిక ప్రాధికారము నుండి అభ్యంతరము అందిన సందర్భంలో, మండలి, తన అభిప్రాయములో ఆ అభ్యంతరము సమర్థనీయముకానిదైనయెడల, తన అభిప్రాయమును వ్రాతపూర్వకముగా నమోదుచేసి, కారణములతో సహా దానిని అట్టి స్థానిక ప్రాధికారమునకు అందజేయవలెను.

iii) అట్టి అభ్యంతరములు / సలహాలు అందిన మీదట, కార్యదర్శి / నియుక్తుడైన అధికారి వాటిపై సంబంధిత పంపిణీ అనుమతి మంజూరు దరఖాస్తు యొక్క గుర్తింపు సంఖ్యను ముద్రించవలెను. సంబంధిత దరఖాస్తుకు చెందిన ఫైలులో అట్టి అభ్యంతరములను ఉంచవలెను. మండలి వెబ్‌సైటులో కూడా దానిని ఉంచవలెను.

iv) దరఖాస్తుదారుడు, 6వ నిబంధన క్రింద ప్రకటనకు బదులుగా అందిన అభ్యంతరములు లేక సలహాలపై తన సూచనలను, పైన (i) లో తెలిపిన 30 రోజుల నోటీసు ముగిసిన 15 రోజుల లోపల సమర్పించవలెను.

v) ఏదేని కంటోన్మెంటు (సైనిక నివాసం), విమానాశ్రయం, కోట, ఆయుధాగారం, ఓడరేవు లేక క్యాంపు (మకాం) కు చెందిన లేక సైనిక ప్రయోజనముల నిమిత్తము కేంద్రప్రభుత్వ అధీనములోనున్న ఏదేని భవనము లేక స్థలమునకు చెందిన పూర్తి లేక కొంత భాగము ప్రాంతము కొరకు పంపిణీ అనుమతి కొరకైన దరఖాస్తు విషయంలో, పంపిణీ అనుమతిని మంజూరు చేయుటకు ముందు, మండలి, అట్టి పంపిణీ అనుమతి మంజూరు కొరకు కేంద్రప్రభుత్వమునకు ఏవిధమైన అభ్యంతరములేనట్లు తెలుసుకొనవలెను.

అయితే, ఈ విషయంలో కేంద్రప్రభుత్వము నుండి ఏవిధమైన సమాధానములేనియెడల, మండలి, తన విచక్షణ మేరకు చట్టప్రకారం వ్యవహరించవలెను.

**10. స్థానిక విచారణ:**

i) మండలి, అవసరమని భావించినయెడల అభ్యంతరములను మరియు / లేక సూచనలను పరిశీలించిన మీదట లేక పంపిణీ అనుమతి మంజూరు కొరకు వ్యవహారములు నడుచుచున్న

ఏ సమయములోనైననూ స్థానిక విచారణను జరుపవచ్చును. దీని కొరకు దరఖాస్తుదారునికి మరియు అభ్యంతరదారులకు ఇద్దరికీ వ్రాతపూర్వకమైన నోటీసును ఈయవలెను.

ii) స్థానిక విచారణ కొరకు ఉత్తరువు చేసి, ఖండము (i) క్రింద విచారణ జరిపినప్పుడు, మండలి, స్థానిక విచారణ కొరకైన తన ఉత్తరువులో లేక వ్రాతపూర్వకమైన తదుపరి ఉత్తరువులో స్థానిక విచారణను ఎంత సమయములో పూర్తిచేయవలెనో నిర్దేశించవలెను:

అయితే, మండలి, వ్రాతపూర్వకముగా కారణములను వ్రాసియుంచి, స్థానిక విచారణ కొరకు తాము నిర్ణయించిన గడువును పొడిగించవచ్చును.

iii) స్థానిక విచారణ కొరకు ఉత్తరువు చేయబడి, ఖండము (i) క్రింద అది నిర్వహించబడినప్పుడు, సదరు స్థానిక విచారణ యొక్క ఫలితముల జ్ఞాపక పత్రమును తయారుచేసి దానిపై దరఖాస్తుదారుడు, విచారణను జరుపునిమిత్తము నియుక్తుడైన అధికారి లేక వ్యక్తి మరియు మండలి ఆదేశించునట్టి ఇతర వ్యక్తి సంతకము చేయవలెను.

iv) పంపిణీ అనుమతి కొరకు దరఖాస్తును విచారించునప్పుడు, మండలి, స్థానిక విచారణ యొక్క ఫలితములను పరిగణనలోనికి తీసుకొనవలెను.

**11. దరఖాస్తు విచారణ మరియు పంపిణీ అనుమతి మంజూరు / తిరస్కరణ:**

i) దస్తావేజులను సమర్పించుట, అనుమతులను పొందుట మరియు ప్రకటనలను (నోటీసులను) ప్రచురించుటకు సంబంధించిన అన్ని షరతులను దరఖాస్తుదారుడు పాటించిన మీదట, మరియు అభ్యంతరములను స్వీకరించుటకు గడువు ముగిసిన మీదట, మండలి, దరఖాస్తుదారుని అభ్యంతరములను మరియు సమాధానములను పరిశీలించుటకు ఉపక్రమించవలెను.

ii) విచారణ తరువాత, మరియు నిర్వహించిన యెడల దరఖాస్తును విచారించిన మీదట, మండలి, పంపిణీ అనుమతిని మంజూరు చేయుటకు లేక తిరస్కరించుటకు నిర్ణయించవచ్చును.

iii) **పంపిణీ అనుమతి తిరస్కరణ:**

పంపిణీ అనుమతిని మంజూరు చేయుటకు మండలి ఇష్టపడని యెడల, అట్టి దరఖాస్తు చట్టము యొక్క లేక సంస్కరణ చట్టము యొక్క నిబంధనలకు, వాటి క్రింద చేసిన నియమములు / నిబంధనలకు లేక ఆ సమయంలో అమలులోనున్న ఏదేని ఇతర చట్టపు నిబంధనలకు అనుగుణముగాలేనట్లయితే, తిరస్కరించుటకు కారణములను వ్రాతపూర్వకముగా నమోదు చేయవలెను:

అయితే, దరఖాస్తుదారునికి తన వాదనను వినిపించుకొను అవకాశమునిచ్చిననే తప్ప ఏ దరఖాస్తును తిరస్కరించరాదు.

మండలి కార్యదర్శి, మండలి జారీచేసిన ఉత్తరువుతోపాటుగా పంపిణీ అనుమతి తిరస్కరణ గురించి కారణములతో సహా దరఖాస్తుదారునికి తెలియజేయవలెను.

iv) **పంపిణీ అనుమతి మంజూరు:**

పంపిణీ అనుమతిని మంజూరు చేయదలచిన యెడల, పంపిణీ అనుమతిని జారీ చేయుటకు ప్రతిపాదించుచున్న వ్యక్తి పేరు, చిరునామా మరియు మండలి సముచితమని భావించునట్టి ఇతర వివరములతో సహా పంపిణీ అనుమతి మంజూరు ప్రతిపాదన యొక్క నోటీసును మండలి సముచితమని భావించునట్లుగా రెండు వార్తా పత్రికలలో ప్రచురించవలెను.

మండలి, పంపిణీ అనుమతిని మంజూరు చేయుటకు ముందు తమకు అందిన సూచనలను లేక అభ్యంతరములను పరిశీలించవలెను.

మండలి, పంపిణీ అనుమతిని మంజూరు చేయుటకు నిర్ణయించిన యెడల, మండలి కార్యదర్శి, అనుబంధము-3 లో తెలిపిన స్వరూపములో లేక మండలి ఆయా సమయములందు ఆదేశించునట్టి రూపములో దరఖాస్తుదారునికి తెలియజేయవలెను.

v) మండలి అనుమతిని ఆమోదించినప్పుడు, అట్టి ఆమోదము గురించి మరియు పంపిణీ అనుమతి మంజూరుకు ప్రతిపాదించిన స్వరూపము గురించి మరియు పంపిణీ అనుమతి మంజూరు కొరకు చెల్లించవలసిన ఫీజుతో సహా దరఖాస్తుదారుడు నెరవేర్చవలసిన షరతుల గురించి, ఆమోదము మంజూరైన తేదీ నుండి 14 రోజుల లోపల కార్యదర్శి దరఖాస్తుదారునికి తెలియజేయవలెను.

vi) వీలైనంతవరకూ, అట్టి దరఖాస్తు అందిన 90 రోజుల లోపల మండలి, పంపిణీ అనుమతి మంజూరు చేయవలెను లేక పంపిణీ అనుమతి మంజూరును కోరుచున్న దరఖాస్తును తిరస్కరించవలెను.

**12. ప్రస్తుతం పంపిణీ అనుమతిదారుడు ఉన్న సరఫరా ప్రాంతంలో అనుమతి మంజూరు కొరకు దరఖాస్తు:**

ప్రస్తుతం పంపిణీ అనుమతిదారుడు ఉన్న సరఫరా ప్రాంతంలో తన స్వంత పంపిణీ వ్యవస్థ ద్వారా విద్యుత్ పంపిణీ కొరకు అనుమతి మంజూరుకై దరఖాస్తు చేయు వ్యక్తి, 4 నుండి 11 వరకూ ఉన్న నిబంధనలకు అదనముగా, కేంద్రప్రభుత్వము జారీ చేసిన "విద్యుత్తు పంపిణీ అనుమతి (మూలధన ఆవశ్యకత, పరపతి మరియు కార్యనిర్వహణ నియమావళి వంటి అదనపు ఆవశ్యకతలు) నియమాలు, 2005" ను పాటించవలెను.

13. భావించబడు అనుమతిదారులు, తాము ఆ విధముగా గుర్తించబడుటకు గాను అనుబంధము-2లో నిర్దేశించిన రూపములో దరఖాస్తు చేసుకొనవలెను. అయితే, 4 నుండి 11 వరకు గల నిబంధనలు భావించబడు అనుమతిదారులకు వర్తించవు.

**14. పంపిణీ అనుమతి ప్రారంభము:**

మండలి నిర్దేశించునట్టి తేదీ నుండి పంపిణీ అనుమతి ప్రారంభమగును.

**15. పంపిణీ అనుమతి వ్యవధి:**

మండలి, పంపిణీ అనుమతిని నిలిపియుంచిన లేక రద్దు చేసిననే తప్ప, అది ప్రారంభమయిన తేదీ నుండి 25 సంవత్సరముల పాటు అమలులో ఉండును.

**16. మ్యాప్‌లను డిపాజిటు చేయుట:**

పంపిణీ అనుమతి మంజూరైనప్పుడు, ప్రతిపాదిత అనుమతి ప్రాంతమునకు కిలోమీటరుకు 10 సెంటీమీటర్లకు తక్కువ కాని స్కేలుపై నిర్దిష్టమైన కేసులో మండలి ఆమోదించిన స్కేలుపై తయారుచేసిన మూడు సెట్ల మ్యాపులపై కార్యదర్శి సంతకము చేసి పంపిణీ అనుమతి మంజూరు ప్రకటన (నోటిఫికేషను) తేదీని వేయవలెను. మ్యాప్‌ల ఒక సెట్‌ను మండలి వద్ద డిపాజిటు చేయవలెను. మిగిలిన రెండు సెట్లను అనుమతిదారునికి ఈయవలెను.

**17. పంపిణీ అనుమతి ప్రతులను డిపాజిటు చేయుట:**

i) పంపిణీ అనుమతి మంజూరైన ప్రతి వ్యక్తీ, మంజూరైన 30 రోజులలోపల:

(ఏ) పంపిణీ అనుమతి ప్రతులను తగినన్ని సంఖ్యలో ముద్రించవలెను:

(బి) అనుమతి ప్రాంతమును తెలుపు మ్యాపులను తగిన సంఖ్యలో తయారుచేయవలెను:

(సి) అట్టి పంపిణీ అనుమతి ప్రతిని, మ్యాపులను కార్యాలయ వేళలలో ప్రజలు తనిఖీ నిమిత్తం దాని ప్రధాన కార్యాలయం వద్ద, దాని స్థానిక కార్యాలయము(ల) వద్ద (ఉన్నయెడల), మరియు అనుమతి ప్రాంతములో నున్న ప్రతి స్థానిక ప్రాధికారము యొక్క కార్యాలయము వద్ద ప్రదర్శించవలెను.

ii) ప్రతి పంపిణీ అనుమతిదారుడు, పైన తెలిపిన 30 రోజుల లోపల, ఈ విషయంలో మండలి నిర్దేశించిన విధంగా అనుమతి ప్రాంతములోనున్న ప్రతి స్థానిక ప్రాధికారమునకు పంపిణీ అనుమతి మరియు సంబంధిత మ్యాపుల యొక్క ఒక ప్రతిని ఉచితముగా సరఫరా చేయవలెను. పంపిణీ అనుమతి నకళ్ళను కోరే వ్యక్తుల కొరకు, వాటి ఫోటో కాపీయింగుకు అయ్యే చార్జీలకు మించకుండా సముచితమైన ధరకు ముద్రించిన నకళ్ళను అమ్మే ఏర్పాట్లు చేయవలెను.

**18. పంపిణీ అనుమతికి సవరణలు:**

మండలి, ప్రజాహితము దృష్ట్యా అవసరమని భావించినప్పుడు, చట్టము యొక్క ఉద్దేశములను, ప్రయోజనములను దృష్టిలో ఉంచుకొని పంపిణీ అనుమతిదారుడు లేక సంబంధిత స్థానిక ప్రాధికారము చేసిన దరఖాస్తుపై లేక ఇతర విధముగా, తాను సబబని భావించు విధముగా పంపిణీ అనుమతి యొక్క నిబంధనలు మరియు షరతులతో అట్టి సవరణలు చేయవచ్చును:

అయితే, పంపిణీ అనుమతిదారుని యొక్క సమ్మతితో తప్ప, అట్టి సమ్మతి అనుచితముగా నిలిపి వేయబడినట్లు మండలి అభిప్రాయపడినప్పుడు తప్ప, అట్టి సవరణలు చేయరాదు.

ii) పంపిణీ అనుమతిదారుడు తన పంపిణీ అనుమతిలో సవరణల కొరకు దరఖాస్తు చేసినప్పుడు, అట్టి దరఖాస్తు చేసిన 7 రోజుల లోపల పంపిణీ అనుమతిదారుడు, సవరణను కోరుతున్న పంపిణీ అనుమతి ప్రాంతములో అధిక ప్రాచుర్యములో నున్న ఒక ఆంగ్ల వార్తా దినపత్రిక మరియు రెండు తెలుగు దినపత్రికలలో ఈ క్రింది వివరములను తెలుపుతూ ఒక ప్రకటనను ముద్రించవలెను:

(ఏ) ప్రస్తుత పంపిణీ అనుమతి యొక్క సంగ్రహ వివరములు:

(బి) ప్రస్తుత పంపిణీ అనుమతికి ప్రతిపాదించిన సవరణలు: మరియు

(సి) సవరణకు గల కారణములు:

(డి) ప్రతిపాదిత పంపిణీ అనుమతి ప్రాంతములోని పెద్ద నగరములు లేక పట్టణములలో, దరఖాస్తును మరియు ఇతర దస్తావేజులను తనిఖీ కొరకు ఎవరు అందించగలరు లేక వాటిని ఫోటో కాపీయింగు చార్జీలకు మించని రేటుకు ఎవరి వద్ద నుండి స్వయంగా కొనుగోలు చేయవచ్చునో లేక పోస్టు ద్వారా దరఖాస్తుదారుడు నామనిర్ధేశము చేసిన వారి పేర్లు, చిరునామాలు మరియు ఇతర వివరములు:

(ఇ) మండలికి చేసిన దరఖాస్తుకు సంబంధించి ఏదేని సూచన లేక అభ్యంతరమును తెలుపగోరు వ్యక్తి, ప్రకటన మొదట ప్రచురించబడిన తేదీ నుండి 30 రోజుల లోపల వ్రాతపూర్వకముగా (ఆరు ప్రతులలో) కార్యదర్శికి తెలియజేయవచ్చునని తెలుపుతూ వివరణ.

iii) ఖండము (ii) ప్రకారము ప్రకటనను ప్రచురించిన మీదట సవరణ కొరకు దరఖాస్తుపై అభ్యంతరములను, ఆ అభ్యంతరములు నోటీసు మొదట ప్రచురించబడిన తేదీ నుండి 30 రోజుల లోపల అందినట్లయితే వాటిని మండలి పరిగణనలోనికి తీసుకొనవలెను.

iv) మండలి స్వయంగా పంపిణీ అనుమతికి సవరణను ప్రతిపాదించినప్పుడు, మండలి, సవరణను కోరుతున్న పంపిణీ అనుమతి ప్రాంతములో అధిక ప్రాచుర్యంలో ఉన్న ఒక ఆంగ్ల దిన పత్రికలో అంగ్లములోనూ, ఒక తెలుగు దిన పత్రికలో తెలుగులోనూ ఈ క్రింది వివరములను తెలుపుతూ ఒక ప్రకటన ప్రచురించవలెను:

(ఏ) పంపిణీ అనుమతిదారుని పేరు మరియు సరఫరా ప్రాంతములోని ప్రధాన కార్యాలయ చిరునామా;

(బి) మండలి ప్రతిపాదించిన మార్పు లేక సవరణ యొక్క వర్ణన;

(సి) ప్రతిపాదిత మార్పు లేక సవరణకు సంగ్రహముగా కారణములు;

(డి) మండలికి చేసిన దరఖాస్తుకు సంబంధించి ఏదేని సూచన లేక అభ్యంతరమును తెలుపగోరు వ్యక్తి ప్రకటన మొదట ప్రచురించబడిన తేదీ నుండి 30 రోజులలోపల వ్రాత పూర్వకముగా (అయిదు ప్రతులలో) కార్యదర్శికి తెలియజేయవచ్చునని తెలుపుతూ వివరణ.

మండలి, ప్రతిపాదిత సవరణను అమలుచేయుటకు లేక తిరస్కరించుటకు ముందు ప్రకటన మొదట ప్రచురించబడిన తేదీ నుండి నెల రోజుల లోపల ప్రతిపాదిత సవరణపై అందిన అభ్యంతరములన్నింటినీ పరిగణనలోనికి తీసుకొనవలెను.

v) పంపిణీ అనుమతి మంజూరుకు సంబంధించిన ఈ నిబంధనలను వీలైనంతవరకూ, మరియు అవసరమైన మేరకు, పంపిణీ అనుమతి సవరణ కొరకు దరఖాస్తును పరిశీలించుటలో మరియు పరిష్కరించుటలో వర్తించవలెను.

vi) ఏదేని కంటోన్మెంటు(సైనిక నివాసము), విమానాశ్రయం, కోట, ఆయుధాగారం, ఓడ రేవు లేక క్యాంపు (మకాం) కు చెందిన లేక సైనిక ప్రయోజనముల నిమిత్తము కేంద్ర ప్రభుత్వ ఆధీనములోనున్న ఏదేని భవనము లేక స్థలమునకు చెందిన పూర్తి లేక కొంత ప్రాంతము కొరకు పంపిణీ అనుమతికి సవరణ సంబంధించిన దరఖాస్తు విషయంలో ప్రభుత్వము అనుమతితో మాత్రమే మండలి అట్టి సవరణ చేయవలెను.

**19. పంపిణీ అనుమతి రద్దు:**

i) మండలి, చట్టము యొక్క మరియు సంస్కరణ చట్టము యొక్క వర్తించదగు నిబంధనల ప్రకారం ఈ క్రింద తెలిపిన ఏదేని పరిస్థితులలో పంపిణీ అనుమతిని రద్దు చేయవచ్చును, అవేవనగా:

(ఏ) మండలి అభిప్రాయములో పంపిణీ అనుమతిదారుడు చట్టము క్రింద లేక సంస్కరణ చట్టము ప్రకారం లేక వాటి క్రింద చేయబడిన నియమాలు లేక నిబంధనల ప్రకారం చేయవలసిన దానిని బుద్ధిపూర్వకముగా జాప్యం చేసినపుడు

(బి) పంపిణీ అనుమతి యొక్క ఏవేని నిబంధనలు లేక షరతులను ఉల్లంఘించిన యెడల, అట్టి ఉల్లంఘన వలన అనుమతి రద్దుకు పాత్రమగునని స్పష్టముగా పంపిణీ అనుమతిలో ప్రకటించినప్పటికీ పంపిణీ అనుమతిదారుడు దానిని ఉల్లంఘించినప్పుడు;

(సి) ఈ విషయంలో పంపిణీ అనుమతి ద్వారా నిర్ణయించబడిన వ్యవధి లోపల లేక మండలి మంజూరు చేసిన మరికొంత ఎక్కువ వ్యవధి లోపల పంపిణీ అనుమతిదారుడు.....

(1) పంపిణీ అనుమతి ద్వారా తనపై విధించిన కర్తవ్యములను మరియు బాధ్యతలను పూర్తిగానూ, సమర్ధవంతముగానూ, నిర్వర్తించే స్థితిలో తాను ఉన్నట్లు మండలిని సంతృప్తి పరచుటలో విఫలమైనప్పుడు; లేక

(2) పంపిణీ అనుమతిలో కోరినట్లుగా డిపాజిటు చేయుటలో లేక ధరావతును సమర్పించుటలో లేక ఫీజులు లేక ఇతర ఛార్జీలను చెల్లించుటలో విఫలమైనప్పుడు;

(డి) పంపిణీ అనుమతి ద్వారా అనుమతిదారునిపై విధించిన కర్తవ్యములను మరియు బాధ్యతలను పూర్తిగా మరియు సమర్ధవంతముగా నిర్వర్తించలేని స్థితిలో పంపిణీ అనుమతిదారుని ఆర్థిక పరిస్థితి ఉన్నట్లుగా మండలి అభిప్రాయపడినప్పుడు;

(ఇ) పంపిణీ అనుమతిదారుడు మండలి ఇచ్చిన ఆదేశమును పాటించుటలో విఫలమైనట్లు మండలి అభిప్రాయపడినప్పుడు.

ii) మండలి, ప్రజా ప్రయోజనము దృష్ట్యా అవసరమని భావించినప్పుడు, పంపిణీ అనుమతిదారుని దరఖాస్తుపై లేక అతని సమ్మతితో, మండలి సబబని భావించునట్టి నిబంధనలు మరియు షరతులపై పూర్తి ప్రాంతమునకు లేక కొంత భాగమునకు సంబంధించి పంపిణీ అనుమతిని రద్దు చేయవచ్చును.

iii) పంపిణీ అనుమతిదారునికి మండలి, పంపిణీ అనుమతి రద్దుకు ప్రతిపాదించుటకు గల కారణములను తెలుపుతూ, మూడు నెలలకు తక్కువ కాకుండా వ్రాతపూర్వకమైన నోటీసును ఇచ్చి మరియు ప్రతిపాదిత రద్దుపై నోటీసులో తెలిపిన గడువు లోపల సంబంధిత పంపిణీ అనుమతిదారుడు చూపిన కారణమును పరిశీలించకుండా పైన ఖండము (i) ప్రకారం పంపిణీ అనుమతిని రద్దుచేయరాదు.

మండలి, ఖండము (i) క్రింద పంపిణీకి అనుమతిని రద్దు చేయుటకు బదులుగా, తాము విధించుట సబబని భావించునట్టి తదుపరి నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆ అనుమతిని అమలులో కొనసాగుటకు అనుమతించ వచ్చును. ఆ విధంగా విధించిన తదుపరి నిబంధనలు మరియు షరతులను పంపిణీ అనుమతిదారుడు విధిగా పాటించ వలసియుండును. అవి పంపిణీ అనుమతిలో ఉన్నట్లుగానే అదే ప్రభావము కలిగియుండును.

iv) ఈ నిబంధనల క్రింద మండలి, ఆ పంపిణీ అనుమతిని రద్దు చేసినప్పుడు, పంపిణీ అనుమతిదారునికి రద్దును గూర్చి నోటీసును అందజేయవలెను. రద్దు అమలులోనికి వచ్చు తేదీని కూడా నిర్ణయించవలెను.

v) మండలి, ఖండము (iv) క్రింద పంపిణీ అనుమతి రద్దును గూర్చి నోటీసును ఇచ్చినప్పుడు, చట్టము మరియు/లేక సంస్కరణ చట్టము క్రింద విధించదగు ఏదేని జరిమానాకు లేక ప్రారంభించబడు అభియోగ వ్యవహారములకు ప్రతికూల ప్రభావము లేకుండా, పంపిణీ అనుమతిదారుడు, మండలి నుండి ముందస్తు ఆమోదము పొంది, పంపిణీ అనుమతి మంజూరుకు అర్హుడని మండలి గుర్తించిన వ్యక్తికి సంస్థను/ వ్యాపారమును అమ్మివేయవచ్చును.

**20. పంపిణీ అనుమతిని మరియు సంస్థ అమ్మకమును నిలిపిఉంచుట:**

i) మండలి ఎప్పుడైననూ పంపిణీ అనుమతిదారుడు, ....

(ఎ) వినియోగదారునికి నాణ్యమైన విద్యుత్తుకు సంబంధించిన ప్రమాణములకు అనుగుణముగా అంతరాయము లేని విద్యుత్తు సరఫరాను అందించుటలో నిరంతరం విఫలమవుతున్నట్లు; లేక

(బి) చట్టము యొక్క లేక సంస్కరణ చట్టము యొక్క నిబంధనల ద్వారా విధించబడిన విధులను నిర్వహించలేకపోవుచున్నట్లు లేక కర్తవ్యములను నిర్వర్తించ లేకపోవుచున్నట్లు ; లేక

(సి) చట్టము లేక సంస్కరణ చట్టము క్రింద మండలి ఇచ్చిన ఏదేని ఆదేశమును పాటించుటలో నిరంతరం వైఫల్యం చెందుతున్నట్లు; లేక

(డి) పంపిణీ అనుమతిలోని ఏవేని నిబంధనలు మరియు షరతులను ఉల్లంఘించినట్లు; అభిప్రాయపడినటప్పుడు, మరియు ప్రజా ప్రయోజనము దృష్ట్యా అట్లు చేయుటకు అవసరమైన పరిస్థితులు ఏర్పడినట్లు భావించినప్పుడు, మండలి, వ్రాతపూర్వకముగా కారణములను వ్రాసియుంచి, పంపిణీ అనుమతిదారుని యొక్క పంపిణీ అనుమతిని ఒక సంవత్సర కాలమునకు మించకుండా నిలిపివేయవచ్చును. పంపిణీ అనుమతిలోని నిబంధనలు మరియు షరతులప్రకారం పంపిణీ అనుమతిదారుని కర్తవ్యములను నిర్వర్తించుటకు ఒక పరిపాలకుని (అడ్మినిస్ట్రేటరును) నియమించవచ్చును:

అయితే, 20వ నిబంధన క్రింద పంపిణీ అనుమతిని నిలిపివేయుటకు ముందు, మండలి, ప్రతిపాదిత పంపిణీ అనుమతి రద్దుపై విన్నపము చేసుకొనుటకు పంపిణీ అనుమతిదారునికి యుక్తమైన అవకాశమునీయవలెను. పంపిణీ అనుమతిదారుని విన్నపములు, ఏవేని ఉన్నయెడల, వాటిని పరిశీలించవలెను.

ii) పైన తెలిపినట్లుగా, పంపిణీ అనుమతిని నిలుపుదల చేసినమీదట, చట్టము యొక్క 24వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదములు (2), (3) మరియు (4) వర్తించును.

**21. అనుమతి ఫీజు చెల్లింపు :**

i) అనుమతి ప్రారంభమయిన 30 రోజుల లోపల లేక మండలి అనుమతించునట్టి వ్యవధిలోపల, అనుమతిదారుడు నిర్దిష్టపరచిన ప్రారంభ అనుమతి ఫీజును చెల్లించవలెను.

ii) అనుమతి అమలులో ఉన్న తదుపరి ప్రతి సంవత్సరమునకూ, అనుమతిదారుడు ప్రతి సంవత్సరము ఏప్రియల్ 15వ తేదీ లోగా లేక మండలి అనుమతించినట్టి తదుపరి వ్యవధి లోపల చట్టము యొక్క పరిచ్ఛేదము 86(1) (జి) క్రింద జారీ అయిన నిబంధన ప్రకారం వార్షిక అనుమతి ఫీజును (వేల సంఖ్యకు సవరించి) మండలికి చెల్లించవలెను. ప్రతీ 3 సంవత్సరముల వ్యవధి (బ్లాకు) తరువాత తదుపరి మూడు సంవత్సరముల వ్యవధి (బ్లాకు) కి అవసరమైన యెడల వార్షిక అనుమతి ఫీజును సమీక్షించుటకు మరియు సవరించుటకు మండలికి హక్కు ఉండును. అనుమతిదారుడు అట్టి సవరించిన వార్షిక అనుమతి ఫీజును చెల్లించవలసియుండును.

iii) ఉప-ఖండములు (i) లేక (ii) ల క్రింద బకాయి ఉన్న ఏవేని ఫీజులను నిర్ణీతపరచిన తేదీల లోపల పంపిణీ అనుమతిదారుడు చెల్లించనియెడల:

(ఏ) పంపిణీ అనుమతిదారుడు బకాయి ఉన్న మొత్తముపై ఆ సమయమునందున్న బ్యాంకు రేటు ప్రకారం వడ్డీని చెల్లించవలసి యుండును. వడ్డీని, మొత్తము బకాయిపడిన తేదీ నుండి చెల్లింపు చేయు తేదీ వరకూ చెల్లించవలెను; మరియు

(బి) పంపిణీ అనుమతిదారుడు ఫీజుల వసూలు వ్యవహారములకు లోబడియుండును; మరియు

(సి) చట్టము మరియు సంస్కరణ చట్టముల యొక్క వర్తించదగు నిబంధనలననుసరించి మండలి పంపిణీ అనుమతిని రద్దు చేయవచ్చును:

అయితే, చట్టము మరియు/లేక సంస్కరణ చట్టము లేక ఆ సమయంలో అమలులో ఉన్న ఏదేని ఇతర శాసనమునకు లోబడి ఉండు బాధ్యత నుండి పంపిణీ అనుమతిదారుణ్ణి ఈ ఖండములో ఉన్నదేదియూ విముక్తుణ్ణి చేయదు.

## అధ్యాయము - 4

## పంపిణీ అనుమతి యొక్క సాధారణ షరతులు

**22. పంపిణీ వ్యవస్థ అభివృద్ధి మరియు నిర్వహణ:**

పంపిణీ అనుమతిదారుడు తన పంపిణీ ప్రాంతములో సమర్ధవంతమైన, సమన్వితమైన మరియు పొదుపైన పంపిణీ వ్యవస్థను అభివృద్ధి చేసి నిర్వహించ వలసి యుండును మరియు చట్టము యొక్క నిబంధనలననుసరించి విద్యుత్ సరఫరాను చేయవలెను.

**23. అభ్యర్ధనపై సరఫరా చేయవలసిన బాధ్యత:**

i) చట్టము యొక్క నిబంధనలకు లోబడి, పంపిణీ అనుమతిదారుడు, తన అనుమతి ప్రాంతము లోపల ఏదేని ఆవరణ యజమాని లేక ఆవరణ ఆధీనములోనున్న వ్యక్తి విద్యుత్ సరఫరా కొరకు చేసిన దరఖాస్తుపై, అట్టి దరఖాస్తు అందిన నెల రోజుల లోపల లేక అట్టి సరఫరా చేయుటకు పంపిణీ మెయిన్ల విస్తరణ లేక కొత్త సబ్-స్టేషన్లు అవసరమైన యెడల మండలి నిర్ణీతపరచినట్టి గడువు లోపల అట్టి ఆవరణకు విద్యుత్ సరఫరాను అందించవలెను.

ii) ఆవరణ యొక్క యజమాని లేక దానిని అధీనములో ఉన్న వ్యక్తి ఖండము (i) లోని నిబంధనల ప్రకారం విద్యుత్ సరఫరాను కోరినప్పుడు, మండలి నిర్దేశించిన రూపములో దరఖాస్తును చేయవలెను. ఆ దరఖాస్తుకు సంబంధించిన కార్యవిధానము, మండలి ఆమోదించిన కార్యవిధానముననుసరించి ఉండవలెను.

iii) పంపిణీ అనుమతిదారుడు, ఖండము (i) లోని నిబంధనల ప్రకారం ఆవరణకు విద్యుత్ సరఫరాను అందించుట కొరకై, అవసరమైన యెడల, విద్యుత్ ప్లాంటును లేక విద్యుత్ లైనును ఏర్పాటు చేయవలసియుండును:

అయితే, వేరే సరఫరా ఉన్న ఏదేని ఆవరణకు అనుమతిదారునితో (పంపిణీ అనుమతిదారునితో సహా) మండలి నిర్ధారించినట్టి ధరను చెల్లించుటకు అతడు అంగీకరించిననే తప్ప, అనుమతిదారుని నుండి (పంపిణీ అనుమతిదారునితో సహా) విద్యుత్ సరఫరాను పొందుటకై, అభ్యర్ధించుటకు, లేక సరఫరాను కొనసాగించుటకు ఏ వ్యక్తికి గాని హక్కు ఉండదు:

అంతేకాక, పంపిణీ అనుమతిదారుడు, సరఫరా చేయవలసిన బాధ్యత మరియు సంబంధిత విషయాలకు సంబంధించి, చట్టము యొక్క 43, 44, 46 మరియు 48 పరిచ్ఛేదముల ప్రకారం మండలి జారీ చేసిన నిబంధనలకు బద్ధుడైయుండవలెను.

**24. ఓపెన్ యాక్సెస్:**

పంపిణీ అనుమతిదారుడు, చట్టము యొక్క 42వ పరిచ్ఛేదము క్రింద జారీ చేసిన ఓపెన్ యాక్సెస్ నిబంధనల ననుసరించి ఎవరికైనను తన పంపిణీ వ్యవస్థ ఓపెన్ యాక్సెస్ కొరకు విచక్షణలేని ఏర్పాటు చేయవలెను.

**25. రాయితీలపై నిషేధము:**

పంపిణీ అనుమతిదారుడు, ఏ వ్యక్తికి గాని లేక పంపిణీ అనుమతిదారుని యొక్క ఇతర వ్యాపారమునకు గాని, చట్టము యొక్క 65వ పరిచ్ఛేదము ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రాయితీని తప్ప ఏ విధమైన రాయితీని ఈయరాదు లేక ఆర్థిక సహాయమును చేయరాదు.

**26. అనుచితమైన ప్రాధాన్యతపై నిషేధము:**

i) పంపిణీ అనుమతిదారుడు, పంపిణీ అనుమతి క్రింద తాను అందించవలసిన సేవలలోను మరియు అనుమతి పొందిన వ్యాపారమును నిర్వహించుటలోను, ఏ వ్యక్తికి లేక వ్యక్తుల తరగతికి అనుచితమైన ప్రాధాన్యతను చూపరాదు. ఏ వ్యక్తిపైన లేక వ్యక్తుల తరగతి పైన లేక అనుమతిదారునిపైన లేక ఉత్పాదక కంపెనీ పైన లేక తన వినియోగదారులపైన లేక ఇతర అనుమతిదారుని యొక్క వినియోగదారులపైన సహేతుకముకాని విచక్షణను చూపరాదు:

అయితే, ఈ అనుచితమైన ప్రాధాన్యత మూలంగా చట్టం క్రింద లేక చట్టము యొక్క నిబంధనలననుసరించి ఇతర విధంగా రాష్ట్ర ప్రభుత్వం యొక్క ఆదేశములననుసరించి మండలి జారీ చేసిన ఏదేని ఉత్తరువు అమలును పాటించినట్లు అయిన యెడల, పంపిణీ అనుమతిదారుడు పంపిణీ అనుమతిలోని బాధ్యతలను ఉల్లంఘించినట్లుగా భావించరాదు.

ii) అనుచితమైన ప్రాధాన్యత లేక సహేతుకము కాని విచక్షణ అను పదముల అర్థమును మండలి నిర్ణయించవలెను. ఈ విషయములో మండలి నిర్ణయము అంతిమమైనదగును.

**27. ముందస్తు సమ్మతి అవసరమైన చర్యలు:**

i) పంపిణీ అనుమతిదారుడు మండలి యొక్క వ్రాతపూర్వకమైన పూర్వామోదము లేకుండా ఈ క్రింది చర్యలను చేపట్టరాదు:

(ఏ) ఎవరేని ఇతర అనుమతిదారుని యొక్క సంస్థను కొనుగోలు చేయుట ద్వారా లేక స్వాధీనము చేసుకొనుట ద్వారా లేక ఇతర విధముగా ఆర్జించు వ్యవహారమును చేపట్టుట;

(బి) తన సంస్థను ఇతర అనుమతిదారుని సంస్థతో విలీనము చేయుట; లేక

(సి) అమ్మకము ద్వారా, లీజు (కౌలు) ద్వారా, మార్పిడి లేక ఇతర విధముగా పంపిణీ అనుమతిని అప్పగించుట లేక తన సంస్థను లేక దానిలో భాగమును బదిలీ చేయుట:

అయితే, ఉప-ఖండము (ఏ) లేక ఉప-ఖండము (బి) లో పేర్కొన్న సంస్థ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములో కాకుండా ఇతర రాష్ట్రములో ఉన్న యెడల ఆమోదము అవసరము లేదు.

ii) ఖండము (i) లో తెలిపిన వ్యవహారమునకు సంబంధించిన ఒప్పందమును మండలి యొక్క పూర్వామోదముతో కుదుర్చుకొన్ననే తప్ప, ఆ ఒప్పందము చెల్లనిదగును.

iii) పంపిణీ అనుమతిదారుడు, ఖండము (i) క్రింద ఆమోదము కొరకు దరఖాస్తును దాఖలు చేయుటకు ముందు, తన అనుమతి ప్రాంతములో విద్యుత్తును ప్రసారణ చేయు లేక పంపిణీ చేయు ప్రతి ఇతర అనుమతిదారునికి ఒక నెల రోజులకు తక్కువ కాని నోటీసును ఈయవలెను.

iv) అట్టి పూర్వామోదము అవసరమైనప్పుడు, పంపిణీ అనుమతిదారుడు, ఈ విషయములో సంబంధిత సంగతులను వెల్లడి చేస్తూ మండలి వద్ద తగిన దరఖాస్తును దాఖలు చేయవలెను. మండలి, దరఖాస్తుదాఖలైన మూడు నెలల లోపల, తాము సముచితమని భావించునట్టి నిబంధనలు మరియు షరతులు లేక మార్పులకు లోబడి ఒప్పందమును ఆమోదించవచ్చును లేక వ్రాతపూర్వకముగా కారణములను వ్రాసియుంచి దానిని తిరస్కరించవచ్చును.

v) అయితే, దరఖాస్తుదారునికి తన వాదనను తెలుపుకొనుటకు అవకాశము నిచ్చిననే తప్ప అట్టి దరఖాస్తును తిరస్కరించరాదు.

**28. పంపిణీ అనుమతిదారుని యొక్క ఇతర వ్యాపారము:**

i) పంపిణీ అనుమతిదారుడు, మండలికి ముందుగా తెలియపరచి, ఏదేని ఇతర వ్యాపారమును, అది పంపిణీ వ్యవస్థకు చెందిన ఆస్తులను, మౌలిక సదుపాయములను పూర్తి స్థాయిలో వినియోగించుకొనునంతవరకూ ఈ క్రింది షరతులకు లోబడి నిర్వహించవచ్చును:

(ఏ) పంపిణీ అనుమతిదారుని యొక్క అనుమతి పొందిన వ్యాపారము, దాని నిర్వహణ ఏవిధముగానూ హానికరము కారాదు మరియు/లేక ప్రతికూల ప్రభావమును కలిగించరాదు;

(బి) అట్టి ఇతర వ్యాపారము నుండి వచ్చిన ఆదాయములో మండలి నిర్దేశించినట్టి కొంత భాగమును పంపిణీ అనుమతిదారుని యొక్క వీలింగు ఛార్జీలను తగ్గించుట కొరకు వినియోగించవలెను;

(సి) అనుమతి పొందిన వ్యాపారము అట్టి ఇతర వ్యాపార నిర్వహణకు ఏ విధముగాను రాయితీ ఇవ్వకుండా లేక అట్టి వ్యాపారమునకు మద్దతుగా పంపిణీ ఆస్తులపై ఏ విధమైన భారం పడకుండా చూచునట్లు పంపిణీ అనుమతిదారుడు అట్టి ప్రతి ఇతర వ్యాపారమునకు సంబంధించి ప్రత్యేకముగా అక్కౌంట్లను నిర్వహించవలెను;

(డి) మండలి, ఈ విషయములో నిర్దేశించునట్టి మార్గదర్శకములను పంపిణీ అనుమతిదారుడు అన్నివేళలా పాటించవలెను.

ii) పంపిణీ అనుమతిదారుడు, ఎవరేని వ్యక్తితో ఏవేని రుణములను కుదుర్చుకొనుటకు ముందు లేక ఎవరేని వ్యక్తి బాధ్యత కొరకు హామీని జారీచేయుటకు ముందు, అది కంపెనీల చట్టము, 1956 ద్వారా విధించిన అనుమతించదగు పరిమితులకు మించినప్పుడు గాని లేక కంపెనీల చట్టము, 1956 క్రింద దానిని మినహాయింపుగా భావించలేనప్పుడు మండలి ఆమోదమును

కోరవలెను. సేవా నిబంధనల ప్రకారం ఉద్యోగులకు రుణములు మరియు సాధారణ వ్యాపారంలో సరఫరాదారులకు అడ్వాన్సులు అట్టి ఆమోదమును కోరవలసిన ఆవశ్యకత నుండి మినహాయించబడినవి.

iii) 28వ నిబంధనలో నున్నదేదియూ, చట్టము ప్రారంభమగుటకు ముందు, విద్యుత్ పంపిణీ వ్యాపారములో ఉన్న స్థానిక ప్రాధికారమునకు వర్తించదు.

**29. భాగస్వామి (ఫ్రాంచైజీ):**

పంపిణీ అనుమతిదారుడు తన సరఫరా ప్రాంతములోని నిర్దిష్ట ప్రాంతములో వేరొక వ్యక్తి ద్వారా విద్యుత్ పంపిణీ చేయదలచినప్పుడు అట్టి వ్యక్తి మండలి నుండి ప్రత్యేకముగా అనుమతిని పొందవలసిన అవసరం లేదు. అయితే,

i) అట్టి వ్యక్తి ఎల్లప్పుడూ పంపిణీ అనుమతిదారుని యొక్క సమగ్ర పర్యవేక్షణ మరియు నియంత్రణలో మరియు పంపిణీ అనుమతిలోని నిబంధనలు మరియు షరతులననుసరించి పంపిణీ కర్తవ్యములను నిర్వర్తించవలెను; మరియు

ii) పంపిణీ అనుమతిదారుడు, ఏదేని కర్తవ్యమును అప్పగించుటకు ముందు అట్టి చర్యను గురించి మండలికి తెలియపరచి వ్రాతపూర్వకమైన ఆమోదమును పొందవలెను; మరియు

iii) పంపిణీ అనుమతిదారుడు, తాను అప్పగించిన కర్తవ్యములకు సంబంధించి ఆ వ్యక్తి యొక్క చర్యలకు బాధ్యత వహించవలెను.

**30. పోటీ నిరోధక ఆచరణీయములు:**

పంపిణీ అనుమతిదారుడు ఏదేని ఒప్పందమును కుదుర్చుకొన్నప్పుడు, లేక తన ఆధిక్యతను దుర్వినియోగపరచినప్పుడు లేక విద్యుత్తు పరిశ్రమలో పోటీపై ప్రతికూల ప్రభావమును కలిగించగల లేక కలిగించిన కలయికలో చేరినప్పుడు, మండలి,అట్టి పంపిణీ అనుమతిదారునికి తాను సముచితమని భావించునట్టి ఆదేశములను జారీచేయవచ్చును.

**31. నిబంధనలు, నియమావళులు, ఉత్తరువులు మరియు ఆదేశములను పాటించుట:**

i) చట్టము యొక్క మరియు సంస్కరణ చట్టము యొక్క ప్రయోజనములను సాధించుట కొరకు మండలి సముచితమని భావించి ఆయా సమయములందు జారీ చేసిన నిబంధనలను, నియమావళులను (రాష్ట్రగ్రిడ్ నియమావళి, పంపిణీ నియమావళి, సరఫరా నియమావళి మరియు అనుమతిదారుల పనితీరు ప్రమాణములతో సహా) పంపిణీ అనుమతిదారుడు ఎల్లప్పుడూ పాటించవలెను మరియు అట్టి ఆదేశములను మరియు షరతులను అతిక్రమించుటకు పంపిణీ అనుమతిదారుడు మండలి ఆమోదమును పొందిననే తప్ప తన పంపిణి అనుమతి షరతుల ప్రకారము వ్యవహరించవలెను.

ii) పంపిణీ అనుమతిదారుడు పంపిణీ అనుమతి నిబంధనలను మరియు తాను పాటించవలసిన ఏదేని ఉత్తరువు, నియమావళి, మార్గదర్శకములు లేక నిబంధనలను పాటించుటను

గమనించవలెను. పంపిణీ అనుమతి లేక ఏదేని ఉత్తరువు, నియమావళి, మార్గదర్శకములు లేక నిబంధనలు తన తరపున భౌతిక ఉల్లంఘించబడినట్లు పంపిణీ అనుమతిదారుడు తెలుసుకొన్నయెడల వీలైనంత వెంటనే అట్టి భౌతిక ఉల్లంఘన గురించి మండలికి తెలియజేయవలెను.

**32. పనితీరు ప్రమాణములు:**

i) పంపిణీ అనుమతిదారునికి వర్తించే విధంగా చట్టం యొక్క 57వ పరిచ్ఛేదము క్రింద జారీ చేసిన "అనుమతిదారుల పనితీరు ప్రమాణముల" నిబంధనలో మండలి నిర్దేశించిన ప్రమాణములను పంపిణీ అనుమతిదారుడు పాటించని యెడల, అతనిపై విధించదగు ఏదేని జరిమానాకు లేక ప్రారంభించబడు అభియోగమునకు ప్రతికూల ప్రభావము లేకుండా, అట్టి పంపిణీ అనుమతిదారుడు, నిబంధనల ద్వారా లేక ఇతర విధముగా మండలి నిర్ధారించునట్టి నష్ట పరిహారమును ప్రభావితుడైన వ్యక్తికి చెల్లించవలసియుండును:

అయితే, నష్టపరిహారమును నిర్ధారించుటకు ముందు సంబంధిత పంపిణీ అనుమతిదారునికి తన వాదనను వినిపించుకొనుటకు తగిన అవకాశమునీయవలెను.

ii) ఖండము (i) క్రింద నిర్ధారించబడిన నష్టపరిహారమును సంబంధిత పంపిణీ అనుమతిదారుడు అట్టి నిర్ధారణ జరిగిన 90 రోజుల లోపల చెల్లించవలెను.

iii) పంపిణీ అనుమతిదారుడు, మండలి నిర్ధారించిన వ్యవధిలోపల మండలికి ఈ క్రింది సమాచారమును సమర్పించవలెను, అదేదనగా:-

(ఏ) ఖండము (i) క్రింద సాధించిన పనితీరు స్థాయి;

(బి) ఖండము (ii) క్రింద నష్టపరిహారమును చెల్లించిన కేసుల సంఖ్య మరియు పూర్తి నష్టపరిహార మొత్తము.

iv) మండలి ఖండము (iii) క్రింద తనకు సమర్పించబడినట్టి సమాచారమును తాను సముచితమని భావించునట్టి రూపములోను మరియు రీతిలోనూ కనీసం ప్రతి సంవత్సరమునకు ఒక్కసారి ప్రచురించవలెను.

**33. రాష్ట్రప్రసారణ సంస్థ, రాష్ట్ర విద్యుత్ విడుదల కేంద్రము మరియు ఇతర అనుమతిదారులతో సహకారము:**

i) పంపిణీ అనుమతిదారుడు, రాష్ట్ర విద్యుత్ విడుదల కేంద్రము మరియు రాష్ట్ర ప్రసారణ సంస్థ మరియు/లేక ఇతర అనుమతిదారులకు తమ కర్తవ్యములను నిర్వర్తించుటకు మరియు చట్టము మరియు/లేక సంస్కరణ చట్టము క్రింద తమ అధికారములను వినియోగించుటకు అవసరమైనట్టి సమాచారమును అందించవలెను.

ii) రాష్ట్ర విద్యుత్ విడుదల కేంద్రము, ప్రాంతీయ విద్యుత్ విడుదల కేంద్రము మరియు రాష్ట్ర ప్రసారణ సంస్థ, చట్టము మరియు/లేక సంస్కరణ చట్టము క్రింద జారీ చేసిన ఆదేశములను

పంపిణీ అనుమతిదారుడు ఎల్లప్పుడూ పాటించవలెను.

iii) పంపిణీ అనుమతిదారుడు, విద్యుత్ వ్యవస్థ సమర్ధవంతమైన సమన్వయ నిర్వహణ కొరకు ఉత్పాదక కంపెనీలతోను, ఇతర అనుమతిదారులతోనూ మరియు రాష్ట్ర విద్యుత్ విడుదల కేంద్రముతోనూ సహకరించవలెను.

**34. మీటరింగు (కొలమానం):**

i) పంపిణీ అనుమతిదారుడు చట్టములోని 55వ పరిచ్ఛేదము క్రింద కేంద్ర విద్యుత్ ప్రాధికార సంస్థచే జారీ చేయబడిన నిబంధనలను (మీటర్లు అమర్చుట మరియు నిర్వహణ) అనుసరించవలెను.

ii) ఉత్పాదన, ప్రసారణ మరియు పంపిణి లేక విద్యుత్ వ్యాపారంలో సరియైన లెక్కలు మరియు తనిఖీ (ఆడిటు) కొరకు పంపిణీ లేక విద్యుత్ వ్యాపారములలో అట్టి దశల వద్ద మరియు పంపిణీ లేక విద్యుత్ వ్యాపార స్థలములలో అవసరమని భావించినచోట, మీటర్లను అమర్చుటకై కేంద్ర విద్యుత్ ప్రాధికార సంస్థ పంపిణీ అనుమతిదారుని ఆదేశించ వచ్చును.

**35. భవిష్యత్తు లోడు కొరకు విద్యుత్ సేకరణ ప్రణాళిక:**

i) పంపిణీ అనుమతిదారుడు, తన సరఫరా ప్రాంతములోపల మండలి ఆయా సమయములందు జారీచేసిన మార్గదర్శకములు/నిబంధనలననుసరించి రెండు నియంత్రణ వ్యవధులకు గాను సంవత్సర వారీగా భవిష్యత్తు లోడు నుండి లెక్కించిన భవిష్యత్తు డిమాండును తయారుచేసి మండలికి సమర్పించవలెను;

ii) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము కొరకు భవిష్యత్తు విద్యుత్తు డిమాండును తయారుచేయుటలో అనుమతిదారుడు ప్రసారణ మరియు రాష్ట్రములోని ఇతర పంపిణీ అనుమతిదారులు మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ విడుదల కేంద్రము (ఎస్ఎల్‌డిసి) తో సహకరించవలెను.

iii) అనుమతిదారుడు, అంచనా వేసిన భవిష్యత్తు డిమాండు ఆధారంగా ఇతర పంపిణీ అనుమతిదారులు మరియు ఎస్ఎల్‌డిసిల సహకారంతో రాబోవు విద్యుత్ సేకరణ ప్రణాళికను సమర్పించవలెను. మండలి జారీచేసిన మార్గదర్శకముల ప్రకారం భవిష్యత్తు డిమాండు మరియు విద్యుత్ సేకరణ ప్రణాళిక ఆధారంగా పంపిణీ ప్రణాళికను కూడా అతడు సమర్పించవలెను.

**36. విద్యుత్తు సేకరణ విధానము:**

i) అనుమతిదారుడు, మండలికి తెలిపిన అంగీకారము ప్రకారం, ఉత్పాదకులు, వ్యాపారులు మరియు ఇతరుల నుండి, తన వినియోగదారుల డిమాండును తీర్చుటకు సరిపడునని భావించునట్టి పరిమాణములలో (సంబంధిత మార్గదర్శకముల ప్రకారం అత్యవసర కొనుగోళ్ళ విషయంలో తప్ప) విద్యుత్తును కొనుగోలు చేయవలెను. కొన్ని సముచితమైన సందర్భములలో, విద్యుత్తు ఉత్పాదన వనరులు, దిగుమతులు లేక సరఫరాలలో కొరత కారణంగా, ఉత్పాదకులు, వ్యాపారులు మరియు ఇతరులు అందించగలిగినంతమేరకు తక్కువ పరిమాణములలో కూడా

కొనుగోలు చేయవలెను.

ii) 36వ నిబంధన ప్రకారం మండలి జారీచేసిన అధికార పత్రం లేకుండా అనుమతిదారుడు విద్యుత్తు సామర్థ్యమును మరియు/లేక ఎనర్జీని కొనుగోలు చేయరాదు. అనుమతిదారుడు చేసే విద్యుత్ సేకరణ, వనరుల ప్రణాళికలో భాగంగా మండలికి సమర్పించిన సవివరమైన విద్యుత్ సేకరణ ప్రణాళికతో అనుగుణముగా ఉండవలెను.

iii) అనుమతిదారుడు, విద్యుత్తు సామర్థ్యమును మరియు/లేక ఎనర్జీని, పొదుపైన మరియు సమర్థవంతమైన రీతిలో మరియు పారదర్శకమైన విద్యుత్ కొనుగోలు లేక సేకరణ విధానము క్రింద మరియు ఇందునిమిత్తము మండలి, ఆయా సమయములందు జారీచేసిన నిబంధనలు, ఆదేశములు, మార్గదర్శకములు మరియు ఉత్తరువుల ప్రకారం కొనుగోలు చేయవలెను. మండలి అంగీకరించిన విద్యుత్తు కొనుగోలు ఒప్పందములు (పిపిఏ)ల ద్వారా సేకరించిన విద్యుత్తు కంటె అదనముగా విద్యుత్తును కొనుగోలు చేసిన సందర్భములో, అనుమతిదారులు, చట్టము యొక్క 63వ పరిచ్ఛేదము క్రింద భారతప్రభుత్వ ఇంధన మంత్రిత్వశాఖ జారీచేసిన పోటీ బిడ్డింగు మార్గదర్శకముల ప్రకారం పోటీ బిడ్డింగు పద్ధతిని అనుసరించి, అట్టి సేకరణకుగాను మండలి యొక్క ఆమోదమును పొందవలెను.

iv) కేంద్ర రంగ ఉత్పాదన నుండి విద్యుత్ సామర్థ్యము మరియు/లేక ఎనర్జీలో కేటాయించబడిన వాటా కొనుగోలు విషయంలో మరియు ఇతర/ప్రాంతీయ విద్యుత్ బోర్డు నుండి విద్యుత్ సామర్థ్యము మరియు/లేక ఎనర్జీల అంతర్-సంస్థ మార్పిడి విషయంలో, మండలి యొక్క ఆదేశములు మరియు ఉత్తరువులకు అదనముగా కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి నిర్దేశించినట్టి పద్ధతులను కూడా పాటించవలెను.

v) ఖండము (i) ప్రకారం అవసరమైన అధికారపత్రమును, అనుమతిదారుడు ఈ క్రింది విషయములను మండలి సంతృప్తి మేరకు వివరించిన మీదట మంజూరుచేయవలెను:

(ఏ) 23వ నిబంధన ప్రకారం అనుమతిదారుని సేవాబాధ్యతను నెరవేర్చుటకు అదనపు విద్యుత్‌సామర్థ్యము మరియు/లేక ఎనర్జీ అవసరము; మరియు

(బి) అదనపు విద్యుత్ సామర్థ్యము మరియు/లేక ఎనర్జీని కొనుగోలు చేయు ప్రతిపాదనలకు ఆర్థిక, సాంకేతిక, వ్యవస్థ పరమైన మరియు పర్యావరణ విషయాలలో వాణిజ్యపరంగా ఆచరణీయమగు ప్రత్యామ్నాయాలను అనుమతిదారుడు పరిశీలించుట మరియు అట్టి పరిశీలన మండలి ఆమోదించినరీతిలో నిర్వహించబడినది.

vi) నిబంధన 36 (i) మరియు (ii) లలో విధించిన ఆంక్షలు స్వల్పకాలిక (ఒక సంవత్సర వ్యవధి కంటె తక్కువ) కొనుగోళ్ళకు వర్తించరాదు. అయితే, అట్టి స్వల్పకాలిక కొనుగోళ్ళను, మండలి జారీచేసిన మార్గదర్శకములు, ఏవేని ఉన్నయెడల, వాటిననుసరించి చేయవలెను:

అంతేకాక, చట్టము యొక్క పరిచ్ఛేదము 62 (1) లోని నిబంధనల ప్రకారం మండలి నిర్ణయించిన గరిష్ట మరియు కనిష్ట ధరల లోపల అట్టి కొనుగోళ్ళకు ధరను మండలి నిర్ణయించవలెను.

అంతేకాక, అట్టి కొనుగోళ్ళ వివరములను మండలి ఆదేశించినరీతిలో మండలికి సమర్పించవలెను.

vii) అనుమతిదారుడు, పోటీ బిడ్డింగు మార్గదర్శకములలో నిర్దేశించిన దానికంటె భిన్నమైన పద్ధతిలో విద్యుత్ సేకరణకు ప్రతిపాదించిన యెడల, అతడు తను దాఖలు చేసిన దానిలో మండలి అంగీకారమును కోరవలెను.

**37. మూలధన పెట్టుబడులు:**

i) అనుమతిదారులు, 10 సంవత్సరముల దీర్ఘకాలిక పెట్టుబడుల ప్రణాళికను సమర్పించవలెను. అందులో, అనుమతిదారులు, భవిష్యత్తులోడు మరియు భవిష్యత్తు డిమాండు ప్రకారం సంవత్సర వారీగా సవివరమైన 5 సంవత్సరముల పెట్టుబడి ప్రణాళికను సమకూర్చవలెను. భవిష్యత్తులోడు, డిమాండు మరియు పెట్టుబడి ప్రణాళికల ప్రయోజనముల నిమిత్తము, సంవత్సరము ఏప్రియల్ 1వ తేదీతో ప్రారంభమై మార్చి 31వ తేదీతో ముగియును. ప్రతి అనుమతిదారుడు, తన భవిష్యత్తులోడు మరియు డిమాండులను, సవివరమైన పెట్టుబడి ప్రణాళికతోపాటుగా ప్రతి సంవత్సరము ఏప్రియల్ నెలలో మరియు/లేక మండలి కోరునట్టి ఇతర సమయములలో మండలికి సమర్పించవలెను.

అనుమతిదారుడు, పొదుపైన మరియు సమర్ధవంతమైన రీతిలోను మరియు ఈ నిబంధన ప్రకారము మరియు మండలి ఆయా సమయములందు జారీ చేయు నిబంధనలు, మార్గదర్శకములు, ఆదేశములు మరియు ఉత్తరువుల ప్రకారము మాత్రమే ఏదేని పథకము లేక పథకములలో పెట్టుబడిని పెట్టవలెను.

ii) అనుమతిదారుడు, తదుపరి ఆర్థిక సంవత్సరంలో అమలుపరచుటకు ప్రతిపాదించిన పంపిణీ వ్యవస్థకు సంబంధించిన పెట్టుబడులన్నింటినీ సంబంధిత వివరములతో, పెట్టుబడి ప్రణాళికలో ఉన్నట్టి పెట్టుబడి పథకముల కొరకు అంచనా వేసిన ఖర్చుతోసహా, ప్రతి సంవత్సరమూ మార్చి 31వ తేదీలోగా తప్పనిసరిగా మండలికి ప్రకటించవలెను. అనుమతిదారుడు, మండలి, ఆయా సమయములందు కోరినట్లుగా ప్రతిపాదించిన పెట్టుబడులకు సంబంధించి తదుపరి వివరములను మరియు వివరణలను మండలికి సమర్పించవలెను.

**38. ఆస్తుల బదిలీ:**

i) ఈ నిబంధనలో తెలిపినట్లుగా తప్ప, పంపిణీ అనుమతిదారుడు, ఏకైక లావాదేవీలో గాని లేక అనేక సంబంధిత లావాదేవీలలోగాని, ప్రతిపాదిత బదిలీ సమయంలో, మండలి ఆదేశములద్వారా లేక సాధారణ లేక ప్రత్యేక ఉత్తరువు ద్వారా నిర్ణయించిన మొత్తమునకంటె రికార్డులలో ఉన్న ఆస్తి విలువ మించి ఉన్నప్పుడు అట్టి ఆస్తిపై నిర్వహణ నియంత్రణను బదిలీ

చేయరాదు లేక వదులుకోరాదు.

ii) పంపిణీ అనుమతిదారుడు, మండలి నిర్ణయించిన మొత్తమునకంటె ఏదేని ఆస్తి విలువ మించినప్పుడు, అట్టి ఆస్తిపై నిర్వహణ నియంత్రణను బదిలీ చేయు లేక వదులుకొను తన ఉద్దేశమును ముందుగా వ్రాతపూర్వకమైన నోటీసుద్వారా మండలికి తెలియజేయవలెను. పంపిణీ అనుమతిదారుడు, ఆస్తుల పూర్తి వివరములను, తన ఉద్దేశమునకు గల కారణములను మరియు సంబంధిత అన్ని విషయములను మండలికి వెల్లడిజేయవలెను:

అయితే, మండలి, నోటీసు అందిన 30 పనిదినములలోపల, అట్టి లావాదేవికి మద్దతుగా తదుపరి సమాచారమును కోరవచ్చును. పంపిణీ అనుమతిదారుడు అట్టి తదుపరి సమాచారమును సమర్పించుచున్నప్పుడు సాధారణంగా 30 పనిదినముల లోపల మరియు పైన తెలిపినట్లుగా మండలి అట్టి తదుపరి సమాచారమును కోరని సందర్భంలో దరఖాస్తు దాఖలుచేసిన 60 రోజులలోపల, మండలి, సముచితమని భావించునట్టి నిబంధనలు మరియు షరతులకు లోబడి బదిలీ ఏర్పాటును అంగీకరించవచ్చును లేక కారణములను వ్రాసియుంచి దానిని తిరస్కరించవచ్చును.

iii) పంపిణీ అనుమతిదారుడు, పైన పేర్కొన్న ఏదేని ఆస్తిపై నిర్వహణ నియంత్రణను ఈ క్రింది సందర్భములలో బదిలీ చేయవచ్చును లేక వదులుకొనవచ్చును:

(ఏ) మండలి తాను విధించునట్టి షరతులు లేక పరిమితులకు లోబడి అట్టి నిర్వహణ నియంత్రణ బదిలీకి లేక వదులుకొనుటకు వ్రాతపూర్వకముగా తన సమ్మతిని రూఢిపరచినప్పుడు; లేక

(బి) అట్టి నిర్వహణ నియంత్రణ బదిలీకి లేక వదులుకొనుటకు సంబంధించి పంపిణీ అనుమతిదారునికి నిబంధనలో పేర్కొన్న సమయములోపల మండలి వ్రాతపూర్వకముగా ఏ విధమైన అభ్యంతరమును తెలియపరచనప్పుడు మరియు ఇతర నిబంధనలలో మండలి నిర్దేశించిన పారదర్శకమైన విధానమును అనుసరించుటద్వారా బదిలీ అమలులోనికి వచ్చినప్పుడు:

అయితే పంపిణీ అనుమతిదారుడు, ట్యారిఫ్ నిర్ధారణ కొరకైన నిబంధనలు మరియు షరతులను నిర్దేశిస్తూ మండలి యొక్క నిబంధనల ప్రకారం సమగ్ర ఆదాయ అవసరాలను మరియు ట్యారిఫ్‌లు మరియు చార్జీలనుండి ఆశిస్తున్న ఆదాయాన్ని లెక్కించుట కొరకు మండలికి తాను చేయు దరఖాస్తులో భాగంగా అట్టి లావాదేవీల పూర్తి వివరములను అందించవలెను.

iv) పంపిణీ అనుమతిదారుడు ఏదేని ఆస్తిపై కూడా నిర్వహణ నియంత్రణను, ఈ క్రింది సందర్భములలో బదిలీ చేయవచ్చును లేక వదులుకొనవచ్చును:

(ఏ) ఈ నిబంధన ప్రయోజనముల నిమిత్తము ఈ క్రింది అంశములపై సాధారణ అనుమతితో మండలి ఆదేశములను జారీచేసినప్పుడు:

(1) నిర్దేశించిన వివరములు గల లావాదేవీలు, మరియు/లేక

(2) నిర్దేశించిన వివరములుగల ఆస్తులపై నిర్వహణ నియంత్రణ బదిలీ లేక వదులుకొనుట, మరియు/లేక

(3) ఏ షరతులకు లోబడి అనుమతి ఈయబడినదో ఆ షరతుల ప్రకారం నిర్వహణ నియంత్రణ బదిలీ లేక వదులుకొనుట, లేక

(బి) నిర్వహణ నియంత్రణ యొక్క బదిలీ లేక వదులుకొనుట ఆ సమయములో అమలులో ఉన్న ఏదేని ఇతర శాసనము క్రింద అవసరమైనప్పుడు లేక కర్తవ్యాదేశమైనప్పుడు;

(సి) ప్రస్తుత ఆస్తిని పంపిణీ అనుమతిదారుడు ఆర్జించి కేవలము ఇతర వ్యాపారము కొరకు వినియోగించు చున్నప్పుడు మరియు భూమిలో శాసనపరమైన లేక లాభదాయకమైన ప్రయోజనము ఏర్పడనప్పుడు లేక పంపిణీ వ్యవస్థలో భాగమైనప్పుడు లేక అనుమతి పొందిన వ్యాపారమునకు సంబంధించిన లేక అవసరమైన ఆస్తి కానప్పుడు.

v) పంపిణీ అనుమతిదారుడు, ఈ క్రింది షరతులకు లోబడి తన పెట్టుబడి అవసరాలకు ఆర్థిక వెసులుబాటు కొరకు ఆస్తులను వినియోగించుకొనుటకు హక్కు కలిగియుండును:

(ఏ) పంపిణీ అనుమతిదారుడు అట్టి ఏర్పాట్లను గురించి సంబంధిత ఒప్పందములు అమలులోనికి వచ్చిన తేదీకి కనీసం 15 పనిదినముల లోపల మండలికి తెలియజేయవలెను;

(బి) ఆర్థిక ఏర్పాటు 7 సంవత్సరములకు మించకుండా లేక మండలి నిర్థిష్టంగా ఆదేశించు విధంగా అట్టి ఇతర వ్యవధిపాటు ఉండవలెను;

(సి) పంపిణీ అనుమతిదారుడు అట్టి ఆస్తులను వినియోగించుకొనుటలో వివేకముతోనూ, సహేతుకమైన రీతిలోనూ వ్యవహరించవలెను; మరియు

(డి) పంపిణీ అనుమతిదారుడు పంపిణీ వ్యవస్థ ఆస్తులపై నిర్వహణ నియంత్రణను తనవద్ద ఉంచుకొనవలెను.

**39. వ్యాపార ప్రణాళిక:**

మండలి జారీచేసిన ఇతర నిబంధనలకు లోబడి, పంపిణీ అనుమతిదారుడు, పంపిణీ అనుమతి అమలులోనికి వచ్చిన 3 నెలల లోపల, మండలి ఆదేశించునట్టి వ్యవధికిగాను వ్యాపార ప్రణాళికను సమర్పించవలెను మరియు ఆ ప్రణాళికను ప్రతి సంవత్సరమూ తాజాగా తయారుచేయవలెను. వ్యాపార ప్రణాళికలో ఇతర విషయములతోపాటు ఈ క్రింది అంశములను కూడా పొందుపరచవలెను:

i) సంవత్సర వారీ లోడు వృద్ధి;

ii) సంవత్సరవారీ పంపిణీ నష్టాల తగ్గింపు ప్రతిపాదన, నిర్థిష్ట చర్యా ప్రణాళికతోపాటుగా;

iii) ఇంటర్‌ఫేస్ పాయింట్లవద్ద మీటరింగు కొరకు మీటరింగు ప్రణాళిక;

iv) గతంలోని నష్టాల వ్యవహారం;

v) నష్టాల తగ్గింపు ప్రణాళిక;

v) ఇతర ముఖ్యమైన ఆర్థిక విశ్లేషణ లేక కొలప్రమాణములు:

అయితే, ప్రస్తుత అనుమతిదారులు, ఈ నిబంధనలు జారీ చేయబడిన తేదీ నుండి 3 నెలల లోపల వ్యాపార ప్రణాళికను సమర్పించవలెను.

పంపిణీ అనుమతిదారుడు, గత ఆర్థిక సంవత్సరంలోని వ్యాపార ప్రణాళికను అమలుచేయుటలో సాధించిన అభివృద్ధికి సంబంధించి వాస్తవంగా అమలుపరచిన మరియు మండలి ఆమోదించిన ప్రణాళికల యొక్క తులనాత్మక వివరములతో ప్రతి ఆర్థిక సంవత్సరంలో మొదటి త్రైమాసికం చివర పూర్తి వివరములను మండలికి సమర్పించవలెను.

**40. రైల్వేలు, రహదారులు, టెలిగ్రాఫ్ తీగలు మొదలైనవాటి రక్షణ:**

i) పంపిణీ అనుమతిదారుడు, విద్యుత్ పంపిణీ, సరఫరా లేక వినియోగములో రైల్వేకు, రహదారి (హైవే) కు, విమానాశ్రయమునకు, ట్రామ్‌వేకు, కాలువ లేక వాటర్–వే లేక రేవు, స్థానిక అధికార సంస్థ అధికారంలోని లేక నియంత్రణలోని రేవు లేక వంతెనకు హాని కలిగించరాదు లేక రైల్వే, ఎయిర్‌వే, ట్రామ్‌వే, కాలువ లేక వాటర్–వే లలో రాకపోకలకు అడ్డంకి కలిగించరాదు లేక జోక్యము చేసుకొనరాదు.

ii) పంపిణీ అనుమతిదారుడు, తన విద్యుత్ లైన్లు వేయుటలో విద్యుత్ ప్లాంటు మరియు ఇతర నిర్మాణములను నిర్మించుటలో, మరియు తన వ్యవస్థను నడుపుటలో విద్యుత్ ప్రేరణము ద్వారా లేక ఇతర విధముగా, టెలిగ్రాఫిక్, టెలిఫోను లేక ఎలక్ట్రికల్ సిగ్నలింగు కమ్యూనికేషను నిమిత్తము ఉపయోగించిన ఏదేని వైరు లేక లైను పనిచేయుటలో హాని కలిగించకుండా అన్ని సబబైన రక్షణ చర్యలను తీసుకొనవలెను.

iii) పంపిణీ అనుమతిదారుడు ఖండము (ii) ను ఉల్లంఘిస్తూ విద్యుత్ లైన్లను, విద్యుత్ ప్లాంటును లేక ఇతర నిర్మాణములను నిర్మించుట, వేయుట, వ్యవస్థను నడుపుట గురించి లేక ఏదేని వైరు, లైను లేక కరెంటు వలన హాని కలిగినదని లేక కలిగించలేదని పంపిణీ అనుమతిదారునికి మరియు టెలిగ్రాఫు అధికార సంస్థకు మధ్య విభేదము లేక వివాదము ఏర్పడినపుడు ఆ విషయమును కేంద్రప్రభుత్వమునకు పంపవలెను.

iv) కేంద్రప్రభుత్వము, అట్టి విద్యుత్‌లైన్ల, విద్యుత్ ప్లాంటు మరియు ఇతర నిర్మాణ పనుల నిర్మాణము తరువాత అట్టి లైన్లు, ప్లాంటు, లేక పనులకు సహేతుకముకాని సమీపములో వైరు లేక లైనును వేసినట్లుగా భావించినట్లయితే, 40వ నిబంధనను పాటించుటకు అవసరమైన విధంగా పంపిణీ వ్యవస్థకు అట్టి మార్పులను లేక చేర్పులను చేయవలసినదిగా పంపిణీ అనుమతిదారుని అనుమతించవచ్చును. పంపిణీ అనుమతిదారుడు తదనుసారంగా అట్టి మార్పులను, చేర్పులను చేయవలెను:

అయితే, ఈ ఖండములోను, ఖండము (iii) లోనూ ఉన్నదేదియూ, విద్యుత్ లైను మార్గం లేక విద్యుత్ ప్లాంటు మరియు దానినుండి ప్రసారణ జరిగే పరిమాణంలో గాని స్వభావములో గాని మార్పు చేయనంతకాలం వరకూ విద్యుత్ లైను లేక విద్యుత్‌ప్లాంటు మరమ్మత్తుకు, నవీకరణకు

లేక సవరణకు వర్తించదు.

v) ఈ పరిచ్ఛేదము ప్రకారం కోరిన వాటిని పాటించుటలో పంపిణీ అనుమతిదారుడు తప్పు చేసినప్పుడు, ఈ కారణంగా జరిగిన ఏదేని నష్టము లేక హానికి అతడు పూర్తి నష్టపరిహారమును చెల్లించవలెను. అట్టి నష్టపరిహార మొత్తము విషయములో ఏదేని విభేదము లేక వివాదము ఏర్పడిన యెడల ఆ విషయమును చట్టము యొక్క 158వ పరిచ్ఛేదము ప్రకారం మధ్యవర్తిత్వం ద్వారా నిర్ధారించవలెను.

**వివరణ:** 40వ నిబంధన ప్రయోజనములనిమిత్తం, టెలిగ్రాపు లైను ద్వారా జరిగే టెలిగ్రాఫిక్, టెలిఫోనిక్ లేక ఎలక్ట్రిక్ సిగ్నలింగు కమ్యూనికేషనుకు, విద్యుత్ ప్రేరణము వలనగాని లేక ఇతర విధముగా గాని విద్యుత్ లైను, విద్యుత్ ప్లాంటు లేక ఇతర నిర్మాణము లేక వినియోగము మూలముగా హాని జరిగిన యెడల, టెలిగ్రాపు లైనుకు హాని జరిగినట్లు భావించబడును.

**41. మండలికి సమాచారము:**

i) మండలి, తన స్వంత ప్రయోజనముల నిమిత్తం లేక కేంద్ర ప్రభుత్వము, రాష్ట్ర ప్రభుత్వము, కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి, కేంద్ర విద్యుత్ ప్రాధికార సంస్థ, ప్రాంతీయ లోడు విడుదల కేంద్రము, రాష్ట్రలోడు విడుదల కేంద్రము, కేంద్ర ప్రసారణ సంస్థ మరియు రాష్ట్ర ప్రసారణ సంస్థల ప్రయోజనముల నిమిత్తం, ఆయా సమయములందు కోరిన విధముగా పంపిణీ అనుమతిదారుడు, అన అనుమతి పొందిన వ్యాపారము లేక ఇతర వ్యాపారమునకు సంబంధించినట్టి సమాచారమును, దస్తావేజులను మరియు వివరములను ఆలశ్యము జరుపకుండా మండలికి వెంటనే సమర్పించవలెను. సమాచారమును మండలి నిర్ధేశించిన స్వరూపములో సమర్పించవలెను.

ii) పంపిణీ అనుమతిదారుడు, వీలైనంత త్వరలో మరియు ఎట్టి సందర్భములోనూ పంపిణీ వ్యవస్థలో ఏదేని భాగమునకు ప్రభావము కలిగించిన పెద్ద సంఘటన జరిగిన తరువాత వారము రోజులకు మించకుండా దాని గురించి మండలికి తెలియజేయవలెను మరియు అట్టి పెద్ద సంఘటన జరిగిన ఒక నెల రోజులలోపల:

(ఏ) ఆ సంఘటన మరియు దాని కారణములకు సంబంధించి పంపిణీ అనుమతిదారునికి తెలిసియున్న సంగతుల పూర్తి వివరములను తెలుపుతూ నివేదికను సమర్పించవలెను. మండలి, తన స్వంత విచక్షణ మేరకు ఆ నివేదికను పంపిణీ అనుమతిదారుని ఖర్చుతో ఒక స్వతంత్ర వ్యక్తిచే తయారుచేయించవలసినదిగా కోరవచ్చును.

(బి) నివేదిక ప్రతులను మండలికి మరియు మండలి ఆదేశించిన విధంగా ఆ సంఘటనలో చిక్కుకున్న వారందరికీ ఈయవలెను.

iii) పంపిణీ అనుమతిదారుని ఎవరేని ఉద్యోగులు లేక ఏజెంట్లు ఏదేని చర్యను చేయుట వలన, చేయకుండుట వలన లేక నిర్లక్ష్యము వలన పెద్ద సంఘటన (ప్రమాదము) జరిగినప్పుడు, ఆ సంఘటనలో తీవ్రముగా గాయపడిన వ్యక్తికి లేక ప్రాణములు కోల్పోయిన వ్యక్తుల వారసులకు

మండలి నిర్ధారించునట్టి నష్టపరిహార మొత్తమును చెల్లించవలసినదిగా మండలి ఉత్తరువుద్వారా పంపిణీ అనుమతిదారుని ఆదేశించవచ్చును.

iv) "పెద్ద సంఘటన (ప్రమాదము)" అనగా ఏది అన్న విషయములో మండలి నిర్ణయము అంతిమమై ఉండును.

v) పంపిణీ అనుమతిదారుడు, వీలైనంత త్వరలో ఈ క్రింది విషయములను మండలికి నివేదించవలెను:

(ఏ) తన బాధ్యతలను నిర్వర్తించుటలో పంపిణీ అనుమతిదారుని సమర్థతపై ప్రభావము కలిగించే పరిస్థితులలో ముఖ్యమైన మార్పు;

(బి) చట్టము యొక్క, సంస్కరణ చట్టము యొక్క నిబంధనలు, వాటి క్రింద చేసిన నియమాలు, నిబంధనలు మరియు నియమావళులు (కోడ్లు), మండలి జారీ చేసిన ఆదేశములు మరియు ఉత్తరువులు మరియు పంపిణీ అనుమతిదారుడు ఇతర అనుమతిదారులతో లేక ఉత్పాదన కంపెనీలతో లేక వినియోగదారులతో కుదుర్చుకొన్న ఒప్పందములు/ఏర్పాట్లుకు సంబంధించి భౌతికమైన ఉల్లంఘన; మరియు/లేక

(సి) షేర్ హోల్డింగు విధానములో లేక పంపిణీ అనుమతిదారుని స్వామిత్వము, నియంత్రణ లేక యాజమాన్యములో ప్రముఖమైన మార్పు.

**42. పంపిణీ అనుమతిదారుని యొక్క ఇతర బాధ్యతలు:**

మండలి, ఈ క్రింది విషయములపై పంపిణీ అనుమతిదారుని అదనముగా కోరవచ్చును:

i) పంపిణీ అనుమతిదారుడు నిర్వహించే విద్యుత్ లైన్లను, విద్యుత్ ప్లాంట్లను మరియు సంబంధిత పరికరములను వాడుకొనుటకు అనుమతించిన వ్యక్తితో ఒప్పందమును కుదుర్చుకొనుట;

ii) తన ప్రయోజనముల నిమిత్తం మండలి కోరే సమాచారమును మరియు దస్తావేజులను సమర్పించుట;

iii) పంపిణీ అనుమతిద్వారా ఉత్పన్నమయ్యే వివాదమును మండలిచే లేక మండలిచే నియమించబడిన మధ్యవర్తిచే నిర్ధారించబడుటకు పంపుట;

iv) రాష్ట్రములోని ఇతర అనుమతిదారులకు లేక మినహాయింపు పొందినవారికి విద్యుత్తును టోకుగా సరఫరా చేయుట;

v) మండలి జారీచేసిన ఏదేని ఆదేశమును పాటించుట; మరియు

vi) పంపిణీ అనుమతిలోని నిబంధనలు, షరతుల ప్రకారం వ్యవహరించుట.

**43. పంపిణీ అనుమతిదారుని అకౌంట్లు:**

i) పంపిణీ అనుమతిదారుడు:

(ఏ) అనుమతిపొందిన వ్యాపారముకొరకు సమాచారమును మరియు అకౌంట్ల వివరణలను ప్రత్యేకముగా నిర్వహించవలెను.

(బి) మండలి నిర్ధారించినట్టి రూపంలోనూ, మరియు అట్టి వివరములతోనూ అక్కౌంట్ల వివరణలను నిర్వహించవలెను మరియు మండలి నిర్ధారించే సమయము వరకూ అక్కౌంట్లను వర్తించు చోట కంపెనీల చట్టము, 1956 (1956లో 1వ చట్టము) ఆయా సమయములందు సవరించబడిన ప్రకారం మరియు ఇతర సందర్భములలో ప్రామాణిక అక్కౌంటింగు విధానముననుసరించి నిర్వహించవలెను;

(సి) పంపిణీ అనుమతిదారునిచే నిర్వహించబడు అనుమతిపొందిన వ్యాపారమునకు చెందిన అక్కౌంట్లను, అనుమతి పొందిననూ పొందకున్ననూ అతడు నిర్వహించే ఇతర వ్యాపార అక్కౌంట్లను వేరువేరుగా ఉంచవలెను;

(డి) అనుమతిదారుని పంపిణీ వ్యాపారమునకు చెందిన అక్కౌంట్లను మరియు రిటైలు సరఫరా వ్యాపారమునకు చెందిన అక్కౌంట్లను వేరువేరుగా ప్రత్యేకమైన వ్యాపారములుగా నిర్వహించవలెను. వర్తకము ఎల్లప్పుడూ ప్రత్యేక తరహా వ్యాపారమై ఉండును;

(ఇ) అట్టి రికార్డులు, ప్రతి సంవత్సరమునకు లాభనష్టముల అక్కౌంటుతో కూడిన లెక్కల వివరణల నుండి ఒకే ప్రాతిపదికన బ్యాలన్సు షీటును మరియు నిధుల వనరులు మరియు వర్తింపు గురించి వివరణను దానికి సంబంధించిన వివరణతో సహా తయారుచేయవలెను. ఆదాయము, ఖర్చు, ఆస్తులు, అప్పులు, రిజర్వు (నిలువ) లేక ఏర్పరచిన మొత్తములను వేరువేరుగా చూపవలెను. ఈ మొత్తములు;–

(1) చార్జికి కారణమును వివరిస్తూ ఇతర వ్యాపారమునుండి లేక ఇతర వ్యాపారమునకు చార్జి చేయబడవచ్చును; లేక

(2) పంపిణీ అనుమతిదారుని యొక్క వివిధ వ్యాపార కార్యకలాపముల మధ్య, పంపకము లేక కేటాయింపు ద్వారా నిర్ధారించబడవచ్చును. అట్టి పంపకము లేక కేటాయింపుకు ఆధారమైన వివరణను జతపరచవలెను.

(ఎఫ్) పై ఖండముల ప్రకారం తయారుచేసిన అక్కౌంటింగు వివరణలకు సంబంధించి, ప్రతి సంవత్సరమునకు, వారి అభిప్రాయములో వివరణలు తగు విధముగా తయారుచేయబడినవా మరియు వివరణలకు సంబంధించిన వ్యాపారమునకు ఆపాదించదగిన ఆదాయములు, ఖర్చులు, ఆస్తులు, అప్పులు మరియు రిజర్వు (నిలువ) లు యధార్ధమైన మరియు సముచితమైన అభిప్రాయమును తెలుపుతున్నవా అని తెలుపుతూ ఆడిటర్ల నివేదికను అందించవలెను, మరియు

(జి) అక్కౌంటింగు వివరణల మరియు ఆడిటరు నివేదికల ప్రతులను వాటికి సంబంధించిన సంవత్సరము ముగిసిన పిమ్మట ఆరు నెలలకు మించకుండా మండలికి సమర్పించవలెను.

ii) మండలిచే అధికారము పొందిన ఏ వ్యక్తియైనను, పంపిణీ అనుమతిదారుని యొక్క అకౌంట్లను తనిఖీ చేయుటకు, సరిచూచుటకు అధికారము కలిగి ఉండును. పంపిణీ అనుమతిదారుడు ఆ వ్యక్తికి అవసరమైన సహాయమును అందించవలెను.

**44. మండలికి గల కొన్ని అధికారములు:**

**మండలి జారీచేసిన ఆదేశములను పాటించనందుకు శిక్ష:**

అనుమతిదారుడు, చట్టము యొక్క నిబంధనలను లేక వాటిక్రింద చేసిన నియమములు, నిబంధనలను మరియు ఈ నిబంధనలలో పొందుపరచిన షరతులను ఉల్లంఘించిన యెడల, చట్టము యొక్క 142వ పరిచ్ఛేదము (సెక్షను) క్రింద తీసుకొనుచర్యకు పాత్రుడగును.

**45. విద్యుత్ సరఫరాను, పంపిణీని, వినియోగమును మరియు వాడకమును నియంత్రించుట:**

మండలి, సమర్ధవంతమైన విద్యుత్ సరఫరాను నిర్వహించుటకు, న్యాయబద్ధమైన విద్యుత్ పంపిణీకి హామీ కల్పించుటకు, పోటీతత్వమును పెంపొందించుటకు, ఆ విధముగా చేయుట అవసరము, ఉపయోగకరమని భావించినయెడల, తన ఉత్తరువుద్వారా సరఫరాను, పంపిణీని, వినియోగమును లేక వాడకమును నియంత్రించుటకు ఏర్పాటు చేయవచ్చును:

అయితే, ఈ నిబంధనల క్రింద పంపిణీ అనుమతిదారు (ల) పై ఏవేని ఆంక్షలు మరియు నియంత్రణ (ఆర్&సి) చర్యలు విధించుట అవసరమైనయెడల, మండలి ప్రతిపాదిత ఆర్&సి చర్యల వ్యవధికి కనీసం 45 రోజుల ముందుగా, ఊహించిన, అందుబాటులో ఉన్న, కొరత ఉన్న డిమాండు మరియు ఎనర్జీ వివరములతో సహా అవసరమైన ప్రతిపాదనలను పంపవలెను. మండలి ఆదేశించునట్టి రీతిలో బహిరంగ ప్రకటనను కూడా ప్రచురించవలెను:

అంతేకాక, మండలి, 45వ నిబంధన క్రింద ఉత్తరువును జారీచేయుటకు ముందు ప్రజానీకము నుండి అందిన సలహాలను మరియు సూచనలనూ పరిశీలించవలెను.

**46. దర్యాప్తు మరియు తనిఖీ:**

i) పంపిణీ అనుమతిదారుడు పంపిణీ అనుమతిలోని ఏవేని షరతులను పాటించలేదని లేక చట్టము యొక్క లేక సంస్కరణ చట్టముయొక్క ఏవేని నిబంధనలను లేక వాటిక్రింద చేసిన నియమములను, నిబంధనలను పాటించలేదని మండలి సంతృప్తి చెందిన మీదట, ఎప్పుడైననూ, వ్రాతపూర్వకమైన ఉత్తరువుద్వారా, ఉత్తరువులో తెలిపిన వ్యక్తిని (ఇందులో ఇటుపిమ్మట దర్యాప్తు అధికారి అని పేర్కొనబడును) పంపిణీ అనుమతిదారుని యొక్క వ్యవహారములను దర్యాప్తు చేయుటకు మరియు అట్టి దర్యాప్తు అధికారి చేసిన దర్యాప్తుపై మండలికి నివేదించుటకు ఆదేశించవచ్చును.

ii) దర్యాప్తు అధికారి, చట్టము యొక్క నిబంధనల ప్రకారం దర్యాప్తును నిర్వహించవలెను.

iii) దర్యాప్తు అధికారినుండి దర్యాప్తు నివేదిక అందిన మీదట, మండలి, చట్టము యొక్క నిబంధనల ప్రకారం, మరియు ఆ నివేదికపై విన్నవించుకొనుటకు పంపిణీ అనుమతిదారునికి అవకాశమును ఇచ్చిన మీదట, మండలి అభిప్రాయములో సముచితమైన విధముగా వ్రాతపూర్వకమైన

ఉత్తరువు ద్వారా:

(ఏ) నివేదికపై ఉత్పన్నమైన ఏదేని అంశమునకు సంబంధించి మండలి సబబని భావించు విధంగా అట్టి చర్యను తీసుకొనవలసినదని పంపిణీ అనుమతిదారుని కోరవచ్చును; లేక

(బి) పంపిణీ అనుమతిని రద్దు చేయవచ్చును.

మండలి, చట్టము యొక్క నిబంధనలననుసరించి ఏదేని ఇతర చర్యను కూడా తీసుకొనవచ్చును.

iv) మండలి, పంపిణీ అనుమతిదారుడు తన పుస్తకములలో ఉంచవలసిన కనీస సమాచారమును, అట్టి సమాచారమును ఉంచవలసిన పద్ధతిని, ఈ విషయంలో పంపిణీ అనుమతిదారుడు అనుసరించవలసిన తనిఖీలు, సరినిరూపణలు మరియు తన అభిప్రాయములో దర్యాప్తు అధికారి 46వ నిబంధన క్రింద తన కర్తవ్యములను సంతృప్తికరంగా నిర్వర్తించుటకు అవసరమైన అన్ని ఇతర ఆనుషంగికమైన విషయముల గురించి నిర్దేశించవచ్చును.

v) 46వ నిబంధన ప్రయోజనముల నిమిత్తం, పంపిణీ అనుమతిదారుడు అను పదబందములో, భారతదేశములో చట్టబద్ధముగా ఏర్పడిన పంపిణీ అనుమతిదారుని విషయంలో,-

(ఏ) కేవలం భారతదేశం వెలుపల విద్యుత్ పంపిణీ వ్యాపారమును నిర్వహించు నిమిత్తం ఏర్పాటు చేయబడిన అట్టి పంపిణీ అనుమతిదారుని యొక్క అనుబంధ సంస్థలు; మరియు

(బి) భారతదేశములోగాని, వెలుపలగాని ఉన్న తన అన్ని బ్రాంచీలు (శాఖలు); చేరియుండును.

vi) 46వ నిబంధన క్రింద చేపట్టిన దర్యాప్తుకు ఆనుషంగికమైన అన్ని ఖర్చులను పంపిణీ అనుమతిదారుడు భరించవలెను. మరియు ఇవి పంపిణీ అనుమతిదారు నుండి రావలసియున్న ఇతర అప్పుల కంటె ప్రాధాన్యత కలిగియుండును

మరియు ఈ ఖర్చులను భూమి శిస్తు బకాయిలవలె వసూలు చేయవలెను.

vii) పంపిణీ అనుమతిలోని ఏవేని నిబంధనలను లేక చట్టము లేక సంస్కరణ చట్టము యొక్క నిబంధనలను లేక వాటి క్రింద చేయబడిన నియమాలు లేక నిబంధనలను ఉల్లంఘించుట నుండి నివారించు నిమిత్తము, మండలి, సంస్కరణ చట్టములోని 28 మరియు 29వ పరిచ్ఛేదములు లేక చట్టములోని 142వ పరిచ్ఛేదముననుసరించి అవసరమైన తాత్కాలిక ఉత్తరువును లేక అంతిమ ఉత్తరువును జారీచేయవచ్చును లేక తాత్కాలిక ఉత్తరువును అంతిమ ఉత్తరువుగా మార్చవచ్చును.

**47. వ్యాపారంలో పోటీని ప్రవేశపెట్టుట:**

i) చట్టము యొక్క నిబంధనలకు లోబడి, ప్రస్తుతం ఉన్న పంపిణీ అనుమతిదారుని యొక్క అదే అనుమతి ప్రాంతములో ఎవరేని వ్యక్తికి (వ్యక్తులకు) మండలి పంపిణీ అనుమతిని మంజూరు చేయవచ్చును.

ii) వ్యాపారంలో పోటీని ప్రవేశపెట్టు నిమిత్తం మరియు ఒకే అనుమతి ప్రాంతంలోని వేరువేరు పంపిణీ అనుమతిదారుల మధ్య సహకారము మరియు సమన్వయము ఉండునట్లు చూచుటకు, మండలి, తాము సబబని భావించునట్లుగా పంపిణీ అనుమతిని మార్పుచేస్తూ లేక సవరిస్తూ

సముచితమైన ఉత్తరువులను జారీచేయవచ్చును:

అయితే, ప్రతిపాదిత మార్పు లేక సవరణపై తన వాదనను వినిపించుటకు మండలి, పంపిణీ అనుమతిదారునికి తగిన అవకాశమును ఇచ్చిననే తప్ప, అట్టి ఉత్తరువును జారీ చేయరాదు.

**48. ఆశిస్తున్న ఆదాయలెక్కింపు మరియు ట్యారిఫ్‌లు:**

i) పంపిణీ అనుమతిదారుడు, చార్జీల నుండి సమగ్ర ఆదాయ అవసరాన్ని (ఏఆర్ఆర్‌ను) దాఖలు చేయునప్పుడు మరియు ఏవేని తన ట్యారిఫ్‌లను ప్రతిపాదించుట కొరకు లేక సవరించుట కొరకు, ట్యారిఫ్ నిబంధనలలో మరియు మండలి ఆయా సమయములందు జారీచేసిన ఇతర ఉత్తరువులలోనూ ఉన్న పద్ధతులను, కార్యవిధానములను మరియు ఆదేశములను పాటించవలెను.

ii) ఏదేని ఆర్థిక సంవత్సరములో చట్టములోని 62వ పరిచ్ఛేదము ప్రకారం మండలి నిర్ధారించిన మొత్తము ట్యారిఫ్‌ల రూపంలో వసూలు చేయుటకు పంపిణీ అనుమతిదారుడు అనుమతించబడిన మొత్తము అయి ఉండును.

**49. భావించబడు అనుమతిదారులకు వర్తించు నిబంధనలు:**

ఈ సాధారణ షరతులు, పంపిణీ అనుమతిదారులకు మరియు భావించబడు అనుమతిదారులకు అందరికీ వర్తించును.

## అధ్యాయము - 5

## ఇతర విషయములు

50. ఈ సాధారణ షరతుల అర్థమును అన్వయించుకొనుటలో ఉత్పన్నమైన అన్ని అంశములు మరియు వాటిలోని నిబంధనలు మరియు షరతులకు సంబంధించిన అన్ని అంశములు మండలి నిర్ధారించవలసినవై యుండును మరియు ఈ అంశములపై మండలి నిర్ణయము అంతిమమై ఉండును.

51. అధ్యాయము-4లోని సాధారణ షరతులకు అదనముగా, మండలి ఒక నిర్దిష్టమైన పంపిణీ అనుమతిదారునికి లేక అనుమతిదారుల తరగతికి వర్తించే నిర్దిష్టమైన షరతులను నిర్దేశించవచ్చును. అట్టి షరతులను, అట్టి అనుమతిదారుల లేక అనుమతిదారుల తరగతి యొక్క అనుమతి షరతులుగా భావించవలెను.

**52. మినహాయింపులు:**

i) ఖండము (iii) లో తెలిపినవి తప్ప, డిసెంబరు 29, 2000 తేదీన మండలి సంస్కరణ చట్టము ప్రకారం జారీచేసిన ప్రస్తుత అనుమతిలో నిర్దేశించిన షరతులు ఇందుమూలముగా రద్దయినవి;

ii) మధ్యకాలీన నిబంధన, అనగా, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (భావించబడు అనుమతి షరతులు) నిబంధన, 2004, మండలి జారీచేసిన పంపిణీ అనుమతుల వరకూ ఈ నిబంధనలు అమలులోనికి వచ్చిన తేదీనుండి రద్దగును.

iii) అట్లు రద్దయినప్పటికీ, రద్దయిన నిబంధనల క్రింద చేసినదేదైననూ లేక తీసుకొన్న ఏ చర్య అయిననూ లేక చేసినట్లు లేక చర్య తీసుకొన్నట్లు భావించబడు ఏదైననూ, చట్టము యొక్క నిబంధనలకు లేక వాటి క్రింద చేసిన నియమములు మరియు నిబంధనలకు వ్యతిరేకముగా లేనంత వరకూ వాటిని ఈ నిబంధనల క్రింద చేసినట్లుగానే భావించవలెను.

iv) ఈ నిబంధనల ఉన్నదేదియూ, న్యాయమును అందించుటకుగానూ లేక మండలి ప్రక్రియను దుర్వినియోగము కాకుండా నివారించుటకు గానూ అవసరమైనట్టి ఉత్తరువులను జారీచేయుటలో మండలికి ఉన్న అధికారమును పరిమితము చేయునదిగా లేక ఇతర విధముగా ప్రభావితము కలిగించునదిగా భావించరాదు.

v) మండలి, ఏదేని విషయము లేక విషయముల తరగతికి చెందిన ప్రత్యేక పరిస్థితులలో, అట్టి విషయము లేక విషయముల తరగతికి సంబంధించి వ్యవహరించుటకు గాను అవసరము లేక ఉపయుక్తమని భావించినయెడల, కారణములను వ్రాతపూర్వకముగా నమోదు చేసి, ఈ నిబంధనలకు భిన్నమైన ప్రక్రియను అనుసరించుట నుండి ఈ నిబంధనలలో ఉన్నదేదియూ మండలిని నివారించదు.

**53. ఇబ్బందులను తొలగించుటకు అధికారము:**

ఈ నిబంధనలను అమలుపరచుటలో ఏదేని ఇబ్బంది ఏర్పడినయెడల, అట్టి ఇబ్బందులను తొలగించు నిమిత్తము, చట్టము యొక్క లేక సంస్కరణ చట్టముయొక్క నిబంధనలకు లేక వాటి క్రింద చేసిన నియమములు, నిబంధనలు లేక నియమావళులకు వ్యతిరేకముగా కాకుండా, మండలి సాధారణ లేక ప్రత్యేక ఉత్తరువుద్వారా తాను అవసరము లేక ఉపయుక్తమని భావించునట్టి నిబంధనలను చేయవచ్చును.

(మండలి ఉత్తరువుమేరకు జారీచేయబడినది)

హైదరాబాదు, ఎమ్.డి. మనోహరరాజు

13-8-2013 మండలి కార్యదర్శి

## అనుబంధము - 1

## పంపిణీ అనుమతి మంజూరు కొరకు దరఖాస్తు

**దరఖాస్తుదారుని వివరములు:**

1. దరఖాస్తుదారుని పేరు:
2. చట్టబద్ధముగా ఏర్పరచినరూపము ఉన్నయెడల
3. చిరునామా
4. సంప్రదించవలసిన వ్యక్తి పేరు, హోదా మరియు చిరునామా
5. సంప్రదించవలసిన ఫోను నంబర్లు:
6. ఫ్యాక్స్ నం.
7. ఇ-మెయిలు ఐడి.
8. చట్టబద్ధముగా ఏర్పరచిన స్థలము/రిజిస్ట్రేషను
9. ఏర్పరచిన/రిజిస్టరయిన సంవత్సరము
10. దరఖాస్తుదారుడు పంపిణీకి ప్రతిపాదించిన భౌగోళిక ప్రాంతము
11. జతపరచవలసిన దస్తావేజులు:
    (ఏ) రిజిస్ట్రేషను/చట్టబద్ద ఏర్పాటు ధ్రువపత్రము
    (బి) వ్యాపారమును ప్రారంభించుటకు ధ్రువపత్రము
    (సి) స్థాపన పత్రము మరియు సంఘ నిబంధనావళి
    (డి) దరఖాస్తుదారుని లేక ప్రొమోటరును బద్ధుని చేయుటకు దరఖాస్తుదారు యొక్క అసలు పవర్‌పట్టా
    (ఇ) ఆదాయపు పన్ను రిజిస్ట్రీకరణ వివరములు

**దరఖాస్తుదారుని యొక్క ఆర్థిక సమాచార వివరములు:**

12. గడచిన 5 ఆర్థిక సంవత్సరములలో నికర ఆస్తి విలువ (ప్రతి సంవత్సరము చివరిలో అమలులో ఉన్న మారకపు రేటు ప్రకారం సమానమయిన భారత రూపాయలలోనికి మార్పిడిచేయవలెను) (వర్తించునట్టి ఆర్థికసంవత్సరమును తెలుపవలెను)

| రోజు/నెల/సం.ము నుండి రోజు/నెల/సం.ము వరకు | దేశీయకరెన్సీ | ఉపయోగించిన మార్పిడి రేటు | భారత రూపాయలలో సమానముగా |
|---|---|---|---|
| | | | |
| | | | |

పైన తెలిపిన దానికి మద్దతుగా వార్షిక నివేదికల లేక ధ్రువీకృత ఆడిటు అయిన ఫలితముల నకళ్ళను జతపరచవలెను.

13. గత 5 ఆర్థిక సంవత్సరముల వార్షిక టర్నోవరు.(ప్రతి సంవత్సరము చివర అమలులో ఉన్న మారకపు రేటు ప్రకారం సమానమైన భారత రూపాయలలోనికి మార్పిడి చేయవలెను) (వర్తించునట్టి ఆర్థిక సంవత్సరమును తెలుపవలెను.

| రోజు/నెల/సం.ము నుండి రోజు/నెల/సం.ము వరకు | దేశీయకరెన్సీ | ఉపయోగించిన మార్పిడి రేటు | భారత రూపాయలలో సమానముగా |
|---|---|---|---|
| | | | |

పైన తెలిపిన దానికి మద్ధతుగా వార్షిక నివేదికల లేక ధ్రువీకృత ఆడిటు అయిన ఫలితముల నకళ్ళను జతపరచవలెను.

14. క్రెడిట్ రేటింగు ధ్రువపత్రము

15. అప్పుల ఖాతా ధ్రువపత్రము

16. దరఖాస్తుదారుణ్ణి ఉద్దేశపూర్వకమైన బకాయిదారుగా భారతీయ రిజర్వుబ్యాంకు వర్గీకరించనట్లుగా ధ్రువపత్రము.

17. క్రమసంఖ్యలు 10 మరియు 11లలో తెలిపినవాటికి మద్ధతుగా జతపరచవలసిన దస్తావేజుల జాబితా:

దస్తావేజులపేర్లు:

(ఎ)----------------------

(బి)----------------------

(సి)----------------------

(డి)----------------------

18.(ఏ) దరఖాస్తుదారుడు తానే తన స్వంత బ్యాలన్సుషీటుపై ప్రతిపాదిత విద్యుత్ పంపిణీనంతటికీ ఆర్థిక పెట్టుబడిని సమకూరుస్తున్నాడా?

(బి) ఔను అయితే, దరఖాస్తుదారునుండి ప్రతిపాదించబడిన ఈక్విటీ:

(i) మొత్తము :

(ii) శాతము :

19. దరఖాస్తుదారుడు ఈక్విటీ కొరకు ఇతర ఏజెన్సీతో అనుసంధానం చేసుకొనుటకు ప్రతిపాదించినయెడల, అట్టి ఏజెన్సీ పేరు మరియు చిరునామా:

(ఏ) ఇతర ఏజెన్సీలో సంప్రదించవలసిన వ్యక్తి పేరు, హెూదా మరియు చిరునామా :

(బి) సంప్రదించవలసిన టెలిఫోను నం.

(సి) ఫ్యాక్స్ నం.

(డి) ఇ-మెయిల్ ఐడి

(ఇ) ఇతర ఏజెన్సీనుండి ప్రతిపాదించిన ఈక్విటీ

(i) మొత్తము :

(ii) మొత్తము ఈక్విటీలో శాతము :

(iii) ఈక్విటీకి ప్రతిపాదించినకరెన్సీ:

(ఎఫ్) దరఖాస్తుదారునితో ఈక్విటీలో చేరుటకు ఇతర ఏజెన్సీయొక్క అంగీకార లేఖ

(జి) దరఖాస్తుదారుడు మరియు ఇతర ఏజెన్సీ మధ్య ప్రతిపాదిత అనుసంధానము యొక్క స్వభావము.

20. పంపిణీ కార్యకలాపమునకు ప్రతిపాదించిన అప్పు వివరములు:

(ఏ) రుణదాతల వివరములు:

(బి) వివిధ రుణదాతల నుండి సేకరించవలసిన మొత్తము:

(సి) పైన తెలిపినదానికి మద్ధతుగా రుణదాతల నుండి లేఖలు

21. దరఖాస్తుదారుని యొక్క నిర్వహణ, యాజమాన్య సామర్థ్యం

22. అప్రోచ్ మరియు ప్రక్రియ:

(దరఖాస్తుదారుడు తాను ప్రతిపాదించిన విధంగా పంపిణీ వ్యవస్థను ఏర్పాటు చేయుటకు మరియు విద్యుత్ పంపిణీ వ్యాపారమును నిర్వహించుటకు తన అప్రోచ్ మరియు పద్ధతిని వివరించవలసియుండును. దీనిలో అనుమతి మంజూరైన పిమ్మట మొదటి సంవత్సరంలో విద్యుత్ పంపిణీ వ్యాపారమును నిర్వహించుటపై దరఖాస్తుదారుని ప్రణాళిక వివరణ మరియు తదుపరి 5 సంవత్సరములలో సదరు వ్యాపారముకొరకు భవిష్యత్తు ప్రణాళికలు ఉండవలెను)

**23. దరఖాస్తుదారుని భవిష్యత్తు వ్యాపారమునకు సంబంధించిన సమాచారము:**

(i) దరఖాస్తు చేస్తున్న విద్యుత్ ప్రసారణ లేక పంపిణీ కొరకు అయిదు సంవత్సరముల వ్యాపార ప్రణాళిక మరియు భవిష్యత్తు లోడు వృద్ధి కొరకు నిర్వహణ,మెరుగుదల మరియు భవిష్యత్తులోడు వృద్ధి కొరకు నిర్వహణ, మెరుగుదల మరియు విస్తరణకు ప్రతిపాదిత అనుమతి క్రింద బాధ్యతలను పూర్తిచేయుటకు నిధుల ఏర్పాట్లు.

(ii) 5 సంవత్సరములకు గాను ఖర్చులు, అమ్మకములు, ఆదాయముల వార్షిక భవిష్యత్ సూచనలు, మరియు ప్రతిపాదనలను తెలుపుతూ ప్రోజెక్టుకు సంబంధించి ఆర్థిక పెట్టుబడి.

(దరఖాస్తుదారుని సంతకము)

తేదీ:

**జతపరచవలసిన దస్తావేజుల జాబితా లేక సమర్పించవలసిన సమాచారము:**

(ఏ) దరఖాస్తుదారుడు, స్వతంత్ర వ్యక్తి లేక భారత భాగస్వామ్య చట్టము 1932 (1932లో 9వ చట్టము) క్రింద రిజిస్టరైన భాగస్వామ్య సంస్థ లేక కంపెనీల చట్టము, 1956 (1956లో 1వ చట్టము) క్రింద ఏర్పాటు చేయబడిన ప్రైవేటు లిమిటెడు కంపెనీ లేక పబ్లిక్ లిమిటెడు కంపెనీ లేక చట్టము క్రింద ఏర్పాటు చేయబడిన లేక ఏర్పాటు చేయబడని ఏదేని ఇతర సంస్థ అన్నది తెలుపవలెను. మరియు దాని కార్యాలయ చిరునామా మరియు, ఉన్నయెడల రిజిస్టర్డు కార్యాలయ చిరునామాల పూర్తి వివరములను తెలుపవలెను.

(బి) ప్రతిపాదించబడిన అనుమతి ప్రాంతము యొక్క పతము (మ్యాప్) కిలోమీటరుకు 10 సెంటీమీటర్ల స్కేలుపై గీసినది; అట్టి పతములు అందుబాటులో లేనియెడల, ఆర్డినెన్సు మ్యాపుల అతి పెద్ద సైజుకు తగ్గని స్కేలులో గాని

లేక ప్రత్యేక సందర్భములో మండలి ఆమోదించునట్టి ఇతర స్కేలులోగాని అందుబాటులో ఉన్న పటములు (మ్యాపులు).

(సి) అనుమతి ప్రాంతములోని ఏదేని భాగములో అధికారము కలిగియున్న స్థానిక ప్రాధికార సంస్థల జాబితా.

(డి) పంపిణీ అనుమతి నిమిత్తము దరఖాస్తుదారుడు ఆర్జించుటకు ప్రతిపాదించిన భూములకు సంబంధించి వర్ణించే మరియు అట్టి ఆర్జించు విధానమునకు సంబంధించి వివరణ.

(ఇ) అనుమతి ప్రాంతములో అనుమతి పొందిన వ్యాపారమునకు ఖర్చు చేసే ప్రతిపాదిత పెట్టుబడి వివరణ మరియు మండలి కోరునట్టి ఇతర వివరములు.

(ఎఫ్) దరఖాస్తుదారుడు చట్టబద్ధ సంస్థ అయిన సందర్భములో సంఘ స్థాపన పత్రము మరియు సంఘ నిబంధనావళి యొక్క నకలు మరియు ఇతర వ్యాపార సంస్థల విషయంలో అదే మాదిరి చట్టబద్ధముగా ఏర్పాటు, రిజిస్ట్రీకరణ లేక ఒప్పందము వంటి వర్తించే దస్తావేజులు.

(జి) గత 3 మూడు సంవత్సరములకు చెందిన దరఖాస్తుదారుని వార్షిక అక్కౌంట్ల లేక అవసరమైన అదే మాదిరి ఇతర దస్తావేజులు

(హెచ్) దరఖాస్తులో తెలిపిన సమాచారము యొక్క యధార్ధతను నిరూపించే దరఖాస్తుదారుని ప్రమాణ పత్రము

(ఐ) దరఖాస్తుదారుడు, చట్టబద్ధ సంస్థ అయిన సందర్భములో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములో గాని లేక ఇతర రాష్ట్రములలోగాని విద్యుత్ ఉత్పాదన, పంపిణీ, ప్రసారణ లేక వర్తక వ్యాపారములో ఉన్న ఏదేని కంపెనీ (ల) గ్రూపు వివరములు.

(జె) దరఖాస్తుదారుడు, చట్టబద్ధ సంస్థ కాని సందర్భములో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములో గాని లేక ఇతర రాష్ట్రములోగాని దరఖాస్తుదారుడు ప్రత్యక్షముగా లేక పరోక్షముగా స్వంత ప్రయోజనము కలిగియున్న విద్యుత్ ఉత్పాదన, పంపిణీ, ప్రసారణ లేక వర్తక వ్యాపారమునకు సంబంధించిన వివరములు.

(కె) విద్యుత్ రంగంలో దరఖాస్తుదారుడు కలిగియున్న ఆర్థిక పెట్టుబడుల వివరములు

(ఎల్) దరఖాస్తుదారుడు చట్టబద్ధ సంస్థ అయిన సందర్భంలో, దాని ప్రొమోటర్లకు సంబంధించిన సంగ్రహచరిత్ర

(ఎమ్) దరఖాస్తుదారుని సాంకేతిక అర్హత మరియు గత అనుభవము, దీనిని, దరఖాస్తుదారుడు పంపిణీ అనుమతి ప్రకారం తన బాధ్యతలను సఫలీకృతంగా నిర్వహించగలడా? లేదా మరియు పంపిణీ అనుమతిని మంజూరుచేయుటకు అర్హుడా? కాదా? అను దానిని నిర్ణయించుటలో మండలి పరిశీలించును.

(ఎన్) మండలి కోరునట్టి ఇతర దస్తావేజులు లేక సమాచారము

**అనుబంధము - 2**

**భావింపబడు అనుమతి కొరకు దరఖాస్తు**

1. దరఖాస్తుదారుని వివరములు:

(ఏ) దరఖాస్తుదారుని పూర్తి పేరు :

(బి దరఖాస్తుదారుని చిరునామా :

(సి) దరఖాస్తు రుసుము:

(డిడి వివరములు)

(డి) రిజిస్టర్డు కార్యాలయ చిరునామా:

(ఇ) స్థానిక కార్యాలయ చిరునామా:

(ఎఫ్) సంప్రదించవలసిన టెలిఫోను నంబర్లు:

(జి) ఫ్యాక్స్ నం. :

(హెచ్)ఇ-మెయిల్ ఐడి :

(ఐ) సంస్థ తరపున అధికారం పొందిన

సంతకందారు వివరములు:

(జె) చట్టబద్ధముగా ఏర్పాటైన రూపము (ఉన్నయెడల) :

(కె) చట్టబద్దముగా ఏర్పరచిన/రిజిస్టరైన స్థలము :

(ఎల్) చట్టబద్దముగా ఏర్పరచిన/రిజిస్టరైన సంవత్సరము:

(ఎమ్) జతపరచవలసిన దస్తావేజులు:

(i) రిజిస్ట్రేషను/చట్టబద్ధ ఏర్పాటు ధ్రువపత్రము:

(ii) వ్యాపారమును ప్రారంభించుటకు ధ్రువపత్రము:

(iii) స్థాపనపత్రము మరియు సంఘనిబంధనావళి :
(వ్యాపారములలో విద్యుత్‌పంపిణీ వ్యాపారము కూడా
ఒకటి అని తెలుపవలెను)

(iv) దరఖాస్తుదారుణ్ణి లేక ప్రామోటరును బద్ధుని చేయుటకు
దరఖాస్తుదారుయొక్క అసలు పవర్‌పట్టా :

(v) ఆదాయపు పన్ను రిజిస్ట్రీకరణ వివరములు:

2. డైరెక్టర్లు/సమర్ధత కలిగిన అధికారుల పేర్లు మరియు చిరునామాలు :
(వర్తించునట్లయితే వివరములను సమర్పించవలెను)

3. # పధాన వాటాదారులు/భాగస్వాములు/సభ్యులు :

4. # ప్రధాన వ్యాపార కార్యకలాపము :

5. పంపిణీని నిర్వహించుటకు దరఖాస్తుదారుడు ప్రతిపాదించుచున్న భౌగోళిక ప్రాంతము (జతపరచిన పతములో సరిహద్దులను పేర్కొనవలెను)

6. విద్యుత్తు వివరములు :

(ఏ) విద్యుత్ వనరు

(i) ఓల్టేజి(లు)

(ii) సరఫరా వనరు
(స్వంత ఉత్పాదన/ఇతరులు/డిస్కమ్ నుండి కొనుగోలు)

(iii) గత 12 నెలలలో నిర్వహించిన విద్యుత్ పరిమాణము:

ఏ. డిమాండు (ఎమ్.డబ్ల్యు) :

బి. ఎనర్జీ (ఎమ్.డబ్ల్యు) :

(iv) ఎవరేని డిస్కమ్/ఉత్పాదకుడు/వ్యాపారితో విద్యుత్‌సరఫరా ఒప్పందము ఉన్నదా?
ఉన్నయెడల, విద్యుత్ కొనుగోలుకు సంబంధించి సంగ్రహ వివరములు:

(బి) విద్యుత్ సరఫరా:

(i) సరఫరా ఓల్టేజీలు

(ii) విద్యుత్తును పంపిణీ చేయుటకు ఉద్దేశించబడిన వ్యక్తులు,
వ్యక్తుల తరగతుల(సభ్యులు/ఉద్యోగుల కాలనీలు/ఇతర సంస్థలు/
సాధారణ ప్రజలు, మొ.) వివరములు.

(సి) భవిష్యత్తులో లోడు వృద్ధి, సరఫరా బాధ్యతలు మొదలైనవాటిని
నెరవేర్చుటకు గాను పోషణ, నిర్వహణ, మెరుగుదల మరియు విస్తరణల

కొరకు నిధుల ఏర్పాట్లు :

(డి) దరఖాస్తుదారుడు తానే తన స్వంత బ్యాలన్సుషీటుపై ప్రతిపాదిత విద్యుత్ పంపిణీ సంతతికీ ఆర్థిక పెట్టుబడిని సమకూరుస్తున్నాడా?

ఔను అయితే, దరఖాస్తు నుండి ప్రతిపాదించబడిన ఈక్విటీ:

(i) మొత్తము:

(ii) శాతము :

7. దరఖాస్తుదారుని యొక్క నిర్వహణ మరియు యాజమాన్య సామర్థ్యం :

(దరఖాస్తుదారుడు తన నిర్వహణ, యాజమాన్య సమర్థతను గురించి, ప్రతిపాదిత సంస్థాగత స్వరూపము గురించి రుజువులను, మరియు వివిధ కార్యనిర్వాహక అధికారుల అనుభవ సంగ్రహము, ప్రతిపాదిత కార్యాలయము మొదలైనవాటిని జతపరచవలెను)

(i) యాజమాన్య సామర్థ్యము :

(ii) ఆర్థిక సమర్థత :

(iii) సరఫరా పనిని సక్రమముగా నిర్వహించే సమర్థత:

8.(ఏ) భావింపబడు అనుమతి ఏ తేదీ నుండి కావలెను :

(బి) భావింపబడు అనుమతి ఎంత వ్యవధికి, కావలెను:

9. అనుమతిని కోరుటకు సమర్థనీయమైన కారణములు:

10. ఇతర సమాచారము:

(ఏ) దరఖాస్తుదారుడు గాని లేక అతని భాగస్వాములు లేక ప్రొమోటర్లు లేక డైరెక్టర్లు లేక అసోసియేట్లలో ఎవరైననూ దివాలాదారుగా ప్రకటించబడి రుణ విముక్తుడు కాలేదా అయినచో అట్టి వివరములు:

(బి) దరఖాస్తు చేయుచున్న సంవత్సరమునకు ముందు మూడు సంవత్సరములలో దరఖాస్తుదారుడు, ఎవరేని అతని భాగస్వాములు, ప్రొమోటర్లు లేక డైరెక్టర్లు, లేక అసోసియేట్లు, మోసము లేక ఆర్థిక నేరములలో శిక్షకు గురి అయిన కేసుల వివరములు:

(సి) దరఖాస్తుదారుడు, ఎవరేని అతని భాగస్వాములు లేక ప్రొమోటర్లు లేక డైరెక్టర్లు లేక అసోసియేట్లుతో ప్రమేయము ఉండి నిలిచియున్న కేసుల వివరములు. ఈ వివరములలో వివాద స్వభావము, సివిలు లేక క్రిమినలు, ఇతర కక్షిదారుడు లేక కక్షిదారుల పేర్లు, కేసులు నిలిచియున్న న్యాయస్థానము మరియు వాటి తాజా స్థితి (దశ)

(డి) దరఖాస్తుదారునికి లేక ఎవరేని అతని భాగస్వాములు లేక ప్రొమోటర్లు లేక డైరెక్టర్లు లేక అసోసియేట్లకు ఎప్పుడైననూ అనుమతి నిరాకరించబడినదా? అయినట్లయితే, దరఖాస్తు చేయబడిన తేదీ, తిరస్కరించబడిన తేదీ మరియు తిరస్కరణకు కారణములు.

11. జతపరచిన దస్తావేజుల జాబితా:

(i) --------------

(ii) -------------

స్థలము:
తేదీ: అధికారము కలిగిన వ్యక్తి సంతకము

గమనిక: # భారత ప్రభుత్వము మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ శాఖలు / మంత్రిత్వ శాఖలకు వర్తించదు.

**జతపరచవలసిన దస్తావేజుల జాబితా:**

(1) కంపెనీల రిజిస్ట్రారు నుండి పొందిన ఏర్పాటు ధ్రువపత్రము

(2) కంపెనీ స్థాపన పత్రము / సంఘ నిబంధనివళి / భాగస్వామ్య పత్రము, మొదలగునవి

(3) దరఖాస్తు ఫారము పై సంతకము చేయుటకు అధికారము పొందినట్లు రుజువు

(4) యాజమాన్య మరియు ఆర్థిక సమర్థతకు సంబంధించిన సమాచారము

(ఏ) యాజమాన్యమునకు సంబంధించి:

(i) సీనియరు యాజమాన్య అధికారుల అర్హత మరియు అనుభవ సంగ్రహము

(ii) సాంకేతికపరమైన మరియు సాంకేతికము కాని వివిధ తరగతుల సిబ్బంది సంఖ్య

(బి) ఆర్థికపరమైనవి:

(i) దరఖాస్తుదారుడు ఆర్థిక స్తోమత కలిగిన వ్యక్తి అని తెలిపే బ్యాంకు హామీలు

(ii) తాజా బ్యాలన్సు షీటు

(iii) ఇటీవలి తాజా ఆర్థిక సంవత్సరములకుగాను, దరఖాస్తుదారునికి మరియు ఏదేని హోల్డింగు కంపెనీ, అధీన లేక అనుబంధ కంపెనీకి చెందిన ఆడిటు అయిన అక్కౌంట్లు

(iv) పైన తెలిపిన వివరణలపై ప్రఖ్యాత చార్టర్డు అక్కౌంటెంటు నుండి పొందిన ఏవేని వివరణలు మరియు ధ్రువీకరణ పత్రములు

(5) **దరఖాస్తుదారుని భవిష్యత్తు వ్యాపారమునకు సంబంధించిన సమాచారము**

(i) దరఖాస్తు చేయబడిన వ్యాపారమునకు సంబంధించి 5 సంవత్సరముల వ్యాపార ప్రణాళిక

(ii) 5 సంవత్సరములకు గాను ఖర్చులు, అమ్మకములు, ఆదాయములు మరియు ప్రతిపాదనలను తెలుపుతూ ప్రోజెక్టుకు సంబంధించిన ఆర్థిక పెట్టుబడి

(6) ప్రతిపాదిత సరఫరా ప్రాంతము యొక్క సవివరమైన పటములు (మ్యాప్‌లు) సరఫరా చేసిన ప్రాంతము మరియు ప్రసారణ / ఉప-ప్రసారణ మరియు పంపిణీ వ్యవస్థ, సబ్-స్టేషన్ల సమాచారముతో సహా, కూడియున్న

సవివరమైన పటములు. పటములో, ప్రస్తుతం ఉన్న వ్యవస్థ మరియు సరఫరా అందించు నిమిత్తం అవసరమైన లేక అవసరంకానున్న కొత్త సౌకర్యముల మధ్య తేడాను స్పష్టముగా చూపవలెను.

పటములో, విద్యుత్ పంపిణీ జరుగుతున్న వీధులు మరియు రోడ్లను చూపవలెను. పబ్లికు మరియు ప్రైవేటు మధ్య తేడాను కూడా చూపవలెను.

(7) పంపిణీ అధికారికి / రాష్ట్ర ప్రసారణ సంస్థ (ఎస్‌టియు) కు దరఖాస్తు నకలును అందజేసినట్లుగా రుజువు

(8) పైన తెలిపిన ఏవేని దస్తావేజులను సమర్పించకపోవుటకు కారణములు

(9) ఆదాయ పన్ను రిజిస్ట్రేషను వివరములు

(10) ఇతర సంబంధిత సమాచారము

**అనుబంధము - 3**

**ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి**

**పంపిణీ అనుమతి**

1. ఈ క్రింద తెలిపిన పంపిణీ ప్రాంతములో విద్యుత్ పంపిణీ చేయుటకుగాను, చట్టములలో చేసిన నిబంధనలకు, నియమములకు, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (పంపిణీ అనుమతి) నిబంధనల ప్రకారం నిర్థిష్టపరచిన పంపిణీ అనుమతిలోని సాధారణ షరతులకు మరియు మండలి నిర్దేశించిన ఇతర నిబంధనలకు (ఇందులో ఇటు పిమ్మట నిబంధనలు అని పేర్కొనబడును) లోబడి మరియు ఈ అనుమతిలో భాగంగా ఉండే శాసనపరమైన సవరణలు, మార్పులు, చేర్పులు, తిరిగి చేయబడిన చట్టములకు లోబడి, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఇందులో ఇటు పిమ్మట మండలి అని పేర్కొనబడును) విద్యుత్ చట్టము, 2003 లోని 14వ పరిచ్ఛేదము (సెక్షను) క్రింద తనకు లభించిన అధికారములను వినియోగిస్తూ, మెస్సర్స్ ........................................... కు (ఇందులో ఇటు పిమ్మట అనుమతిదారుడుగా పేర్కొనబడును) ఇందు మూలముగా అనుమతిని జారీచేయడమైనది.

**2. పంపిణీ ప్రాంతము:**

ఈ క్రింద తెలిపిన సరిహద్దులలోపల ఉన్న మొత్తము ప్రాంతము పంపిణీ ప్రాంతముగా ఉండును:

ఉత్తరం :

తూర్పు :

దక్షిణం :

పడమర :

3. ఈ అనుమతి, చట్టములలోని నిబంధనలు, నియమములు మరియు రెగ్యులేషన్లు (నిబంధనల) ప్రకారం తప్ప, బదలాయించబడదు.

4. (1) అనుమతిదారుడు, మండలి పూర్వామోదము లేకుండా --

(ఏ) ఇతర అనుమతిదారుని యొక్క సంస్థను కొనుగోలు ద్వారా లేక స్వాధీనము చేసుకొనుట ద్వారా ఆర్జించుటకు కార్యకలాపమును చేపట్టరాదు; లేక

(బి) తన సంస్థను ఇతర అనుమతిదారుని యొక్క సంస్థతో కలుపరాదు.

(2) అనుమతిదారుడు ఎప్పుడైనను గాని మండలి యొక్క పూర్వామోదము లేకుండా అమ్మకము, లీజు (కౌలు), మార్పిడి ద్వారా లేక ఇతర విధముగా తన అనుమతిని అప్పగించరాదు లేక తన సంస్థను లేక అందలి భాగమును బదిలీ చేయరాదు.

(3) ఉప-ఖండము (1) మరియు ఉప-ఖండము (2) లలో పేర్కొన్న ఏదేని వ్యవహారమునకు సంబంధించిన ఒప్పందము, మండలి యొక్క పూర్వామోదముతో కుదుర్చుకొన్ననే తప్ప, చెల్లనిదగును.

5. అనుమతిదారునికి ఈ అనుమతిని మంజూరు చేయుటవలన, అదే ప్రాంతములో విద్యుత్ పంపిణీ కొరకు మరొక వ్యక్తికి అనుమతిని మంజూరు చేయుటకు మండలికి ఉన్న హక్కును ఆటంకపరచదు లేక పరిమితం చేయదు. అనుమతిదారుడు తన ప్రత్యేకతను క్లెయిము చేయరాదు.

6. అనుమతి, అది జారీ అయిన తేదీ నుండి అమలు లోనికి వచ్చును మరియు ముందుగానే రద్దు చేయబడిననే తప్ప 25 సంవత్సరముల కాలము పాటు అమలులో ఉండును.

7. అనుమతిదారుడు, మండలి యొక్క పూర్వామోదముతో, తన ఆస్తులను పూర్తి స్థాయిలో వినియోగించుట కొరకు ఇతర వ్యాపారమును చేయవచ్చును.

8. అనుమతిదారుడు, మండలి నిర్దేశించిన అనుమతి ఫీజును చెల్లించవలెను.

9. అనుమతి రద్దు మరియు అతడి సంస్థ అమ్మకమునకు సంబంధించి చట్టములలో ఉన్న నిబంధనలు అనుమతిదారునకు వర్తించును.

కార్యదర్శి

గమనిక: నిబంధన యొక్క ఈ తెలుగు అనువాదము ప్రజాసౌకర్యం నిమిత్తం చేసిన స్వేచ్ఛానువాదం మాత్రమే. అధికారిక పాఠం కాదు.